

- భయమూ, భక్తి లేకుండా ఆలయాల నిధులు భారీగా దుర్వినియోగం
- అరికట్టాల్సిన ఆడిటింగ్ శాఖంతా అవినీతిమయం
- ప్రీ, పోస్ట్ ఆడిట్లలోనూ అనేక అవకతవకలు
- నెలమామూళ్లతో సహకరిస్తున్న వైనం
- ఇటీవల ఐదుగురు ఈవోల సస్పెన్షన్.. మరి ఆడిటర్లపై చర్యలేవి ?
- ఏళ్లతరబడి పాతుకుపోయిన సిబ్బంది

దేవుడి సొమ్మా..

అయితే ఏంటి ?



నెల్లూరు రంగనాయకులపేటలోని జిల్లా ఆడిటింగ్‌శాఖ కార్యాలయం

నెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం అంటే బాధ్యత లేదు.. దేవుడంటే భయమూ, భక్తి లేవు..! ఆలయాల్లో అక్రమాలను అరికట్టాల్సిన ఆడిటింగ్ శాఖనే.. అవినీతికి సహకరిస్తోంది. ప్రీఆడిట్ ద్వారా అక్రమాలకు అడ్డుకట్టాలని ప్రభుత్వం భావిస్తే.. దాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఆడిట్‌శాఖ అధికారుల వద్ద ఉండాల్సిన ప్రీఆడిట్ లాగిన్లు దేవాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది వద్ద ఉన్నట్లు గతంలోనే ఏసీబీ విచారణలో బయటపడింది. ఇటీవల జిల్లాలోని మూడు ఆలయాల్లో నిధుల దుర్విని యోగానికి సంబంధించి ఐదుగురు ఎగ్జిక్యూటివ్ అధికారుల (ఈవోల)ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇంతస్థాయిలో నిధులు పక్కదారి పడితే ఆడిటింగ్ శాఖ ఏం చేస్తోందన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతీరూపాయికి ఆడిటింగ్ చేసే అధికారులు... మరి అక్రమాలను ఎందుకు గుర్తించలేక పోయారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికీ పలు ఆలయాల్లో దేవదాయశాఖ విజిలెన్స్ విభాగం విచారణ చేస్తోంది. పలు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తు న్నాయి. ఇంత జరుగుతున్నా ఆడిటింగ్ శాఖలో ఇందుకు బాధ్యులైన అధికారులపై విచారణ గానీ, చర్యలు గానీ తీసుకోలేదు. ఆడిటింగ్ శాఖ అధికారులు చేసే ప్రీఆడిట్, పోస్ట్ ఆడిట్ వద్దే అక్రమాలకు బ్రేకులు వేస్తే ఆలయాల్లో అవినీతికి ఆస్కారముండదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

● ఎందుకు పట్టించుకోవడం లేదు..?

ఆలయాలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి కీలక విభాగాల్లో అవినీతిని అరికట్టి, జవాబుదారీతనం పెంచేందుకు రాష్ట్ర ఆడిట్‌శాఖ ఏటా ఆడిటింగ్ నిర్వహిస్తుంది. నిధుల ఖర్చును క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లను గుర్తిస్తుంది. అయితే దొంగ బిల్లులతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం 2022లో ప్రీఆడిట్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం ఆలయాల్లో ఒక్క రూపాయి ఖర్చు పెట్టాలన్నా ముందుగా ఆడిటర్ల నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ బిల్లు ఆడిటర్ల లాగిన్‌కు వెళ్లాక వారు క్షుణ్ణంగా పరిశీలించి అది నిబంధనల ప్రకారం వచ్చిన బిల్లేనా.. లేదా..? అన్నది పరిశీలించి అప్రూవల్ ఇవ్వాలి. ఉదాహరణకు ఒక ఆలయంలో ఒక వస్తువును కొనుగోలు చేసేందుకు బిల్లు పెడితే.. ఆ మొత్తం ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా ఉందా..? అనేదాన్ని పరిశీలించాలి. ప్రీఆడిట్‌లో ఏవైనా రిమార్కులు వస్తే వాటిని పోస్ట్ ఆడిట్‌లో పరిశీలించాలి. కానీ గత కొన్నేళ్లుగా ఆలయాల్లో ఆడిటింగ్ నామమాత్రంగా జరుగుతున్నట్లు ఇటీవల వెలుగుచూసిన పరిణామాలు చెబుతున్నాయి. ఆలయాల నుంచి వస్తున్న బిల్లులను పరిశీలించ కుండానే ఆడిటింగ్ సిబ్బంది అప్రూవల్ చేస్తున్నట్లు సమాచారం. ఆడిటర్ల వద్ద ఉండాల్సిన ప్రీఆడిట్ లాగిన్లు ఆలయాల సిబ్బంది వద్ద ఉంటున్నాయి. వారు ఇష్టం వచ్చినట్లు బిల్లులు పెట్టుకుంటున్నారు. నెల్లూరు రంగనాథస్వామి ఆలయంలో గతేడాది ఏసీబీ అధికారుల విచారణలో ఈ విషయం బయట పడింది. అయినా బాధ్యులైన ఆడిట్ అధికారులపై చర్యలు మాత్రం తీసుకోలేదు. నాడు రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణ అంటూ హడావుడి చేసి ఆ తర్వాత సర్దుకున్నారు.

● జీతాలకూ డబ్బుల్లేవట !

ఏదైనా ఒక ఆలయంలో ఏ విభాగానికి ఎంత ఖర్చు చేయాలన్నది స్పష్టంగా ఉంది. ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు 30 శాతానికి మించకూడదు. కానీ చాలా ఆలయాల్లో ఇది పరిధి దాటిపోతోంది. ఒక్క జొన్నవాడ ఆలయంలోనే దాదాపు 65 శాతం వరకూ ఉన్నట్లు సమాచారం. అసలు ఇంత మొత్తాన్ని ఎస్టాబ్లిష్‌మెంట్ పద్దు కింద ఆడిటింగ్ సిబ్బంది ఎలా అనుమతించారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏ ఆలయంలో ఎంతమంది ఉద్యోగులు పనిచేయా లన్నది కూడా నిబంధనల్లో స్పష్టంగా ఉంది. కానీ చాలా చోట్ల పరిమితికి మించి సిబ్బంది పనిచేస్తున్నారు. పైగా జీతాలు కూడా చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ప్రభుత్వ జీవో ప్రకారం జీతాలు చెల్లించడం లేదు. ఇలా సిబ్బంది జీతాలకే ఆలయం ఆదాయంలో సగం సరిపోతోందంటే ఆశ్చర్యం కలగకమానదు. ఒక్క జొన్నవాడ ఆలయంలోనే గత రెండేళ్లలో 32 మంది వరకూ సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేసినట్లు విచారణలో తేలింది. కొన్ని ఆలయాల్లో భారీగా నిధులు దుర్వినియోగం చేసి ఖజానాను ఖాళీ చేయడంతో ప్రస్తుతం సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం, జొన్నవాడ కామాక్షమ్మ ఆలయాలే ఇందుకు ఉదాహరణ. కొన్ని నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న వారికి జీతాలు ఇవ్వలేకపోతున్నారు. దీనంతటికీ ఆడిటింగ్ శాఖ సిబ్బందినే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఏళ్ల తరబడి కొనసాగుతున్న సిబ్బంది

నెల్లూరు ఆడిట్‌శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు, ఉద్యోగులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. సొంత జిల్లాలో ఉండకూడదన్న నిబంధనలు కూడా ఈ శాఖలోని అధికారులకు వర్తించవన్న విమర్శలున్నాయి. ఎన్నికల సమయంలో కూడా ఈ శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు వైసీపీకి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలున్నాయి. మూడు ప్రధాన ఆలయాల్లో భారీగా నిధులు దుర్వినియోగం జరిగినట్లు తేలినా ఈ శాఖలో మాత్రం చలనం లేదు. అసలు ఇన్ని అక్రమాలు జరిగితే ఆ ఆలయాల్లో ఆడిట్ చేసిన అధికారులు, ఉద్యోగుల పాత్ర ఎంతన్నది కూడా తేల్చడం లేదు. అంతేకాకుండా జిల్లాలోని చాలా 6(ఏ) ఆలయా(పెద్ద ఆలయాలు)ల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించడం, ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు భారీ చేయడం, విచ్చలవిడిగా జీతాలు పెంచడం వంటివి జరగ్గా, వాటిని ఆడిట్ అధికారులు అప్రూవల్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

జీతాలకోసం ఆలయ ఉద్యోగులు ఏకరువు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడ ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సు ఉద్యోగులు గత మూడు నెలలుగా జీతాల కోసం ఏకరువు పెడుతున్నారు. గత నెలలో రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే జీతాలు చెల్లించగా, మిగిలిన వారికి చెల్లించలేదు. ఆలయ ఈవోగా శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు చేపట్టే నాటికి రూ. 60వేలు సాధారణ నిధులుండగా, నిధుల కొరతతో జీతాల కొరత ఏర్పడిందని ప్రస్తుత ఈవో తెలిపారు. ఆగస్టు నెల జీతాలు ఈనెలలో చెల్లిస్తామని, పెండింగ్ బకాయిలు వచ్చేనెల 10లోగా చెల్లిస్తామని తెలిపారు.

ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి

● ఐజీ ఆదేశాలతో ఎస్పీ ఉత్తర్వుల జారీ

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 1: పోలీసుశాఖలో ఖాళీల ఆధారంగా జిల్లాలో పనిచేస్తున్న 24 మంది ఏఎస్ఐ (సివిల్)లకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఆదేశాలతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఉత్తర్వులు జరీ చేశారు. ఆ వివరాలు..

పేరు	పనిచేస్తున్న ప్రాంతం
ఎస్‌కే మహబూబ్ బాషా	ఇంటెలిజెన్స్ (నెల్లూరు)
ఆర్ సుధీర్‌కుమార్	వెంకటాచలంస్టేషన్
కే శ్రీనివాసులురెడ్డి	దుత్తలూరు స్టేషన్
ఎస్‌కే గౌస్‌బాషా	కావలి-2 స్టేషన్
ఎస్‌కే ఖాదర్‌బాషా	కొవడలూరు స్టేషన్
ఎం జానకిరామిరెడ్డి	కావలి-2 స్టేషన్
సీహెచ్ తిరుమలరెడ్డి	దగదర్తి
ఎస్‌కే దాదాబాషా	సంతపేట,నెల్లూరు
వీ బ్రహ్మయ్య	దర్గామిట్ట, నెల్లూరు
డీ వెంకటేశ్వరు	మనుబోలు
ఎన్ శ్రీనివాససింగ్	డీసీఆర్‌బీ, నెల్లూరు
కే ముక్తియార్ బాష	డీసీఆర్‌బీ, నెల్లూరు
పీ శ్రీనివాసులు	నెల్లూరు(తిరుపతి)
ఎస్‌కే సుల్తాన్‌బాషా	విడవలూరు
ఏ శీనయ్య	ఉదయగిరి
ఓ శ్రీనివాసులు	విడవలూరు
పీ శ్రీనివాసులురెడ్డి	నెల్లూరు (తిరుపతి)
జీవీ సుబ్బారావు	చేజర్ల
ఎస్ నాగరాజు	కండలేరు
ఎన్ శ్రీనివాసరావు	కావలి రూరల్
యూ నాగయ్య	సంగం
కే శివయ్య	టీపీ గూడూరు
ఏ మనోహర్‌రెడ్డి	కొండాపురం
ఎన్‌వీ శేషుబాబు	ఇంటెలిజెన్స్(నెల్లూరు)

నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్నీ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పరిధిలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో రామారావు, ఆర్‌ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు వేర్వేరు ప్రకటనలో హెచ్చరించారు.

● జిల్లాలో సగటు వర్షపాతం 3.4 మిమీ

జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 3.4 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరు, లింగసముద్రంలలో 5.2 మిమీ వర్షం పడగా, అత్యల్పంగా దగదర్తిలో 2.5 మి.మీ వర్షం కురిసింది.

ఊరటనిచ్చిన ‘పునాస’



- ఉలవపాడు నుంచి కేరళకు ఎగుమతి
- బంగినపల్లి సాగుతో నష్టాలు.. పునాసతో ఊరట
- వర్షసూచనతో వణుకుతున్న రైతు
- మంగుమచ్చతో ధర తగ్గుతుందని ఆందోళన

ఉలవపాడు, సెప్టెంబరు 1: ఈ ఏడాది బంగినపల్లి మామిడి సీజన్‌లో నష్టాలు చవిచూసిన రైతులకు పునాస మామిడి ఊటరనిస్తోంది. ఏడాదికి రెండు కాపులు కాసే పునాస మామిడి తొలిపంట సీజన్ జూలై నుంచే మొదలవు తుంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కాపు దిగుబడి వస్తుంది. తొలినాళ్లలో రేటు ఆశించినంత ఉండకపోయినా, దిగుబడిలో కాయ నాణ్యతను బట్టి, డిమాండ్‌ను బట్టి రేటు పెరుగుతోంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం కిలో ధర రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతోంది. గత 20 రోజుల నుంచి ఉలవపాడ కేంద్రంగా రోజుకి సగటున 50 టన్నుల వరకు పునాస మామిడి ఎగుమతులు జరుగుతున్నాయి.

● 90శాతం ఎగుమతులు కేరళకు..

కాగా పునాస మామిడిపై కేరళ రాష్ట్ర ప్రజలకు ఎంతో మక్కువ. దీంతో పునాస సీజన్‌కు ఆ రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి ఉలవపాడులో రెండునెలలపాటు మకాం వేస్తారు. టన్నుల కొద్దీ కొనుగోలు చేసి తమ రాష్ట్రానికి ఎగుమతులు చేస్తుంటారు. ఓనం పండుగ సమయానికి కేరళలో పునాసకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో రైతులు ఐదారు ఏళ్లుగా మంచి లాభాలు చూస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో సాధారణంగా పంటకు వచ్చే బంగినపల్లి, ఇతర రకాల మామిడి సాగులో ఈ ఏడాది చాలామటుకు రైతులు నష్టాలు చవిచూశారు. నష్టపోయిన రైతులు పునాస సాగులో లాభాలు గడించారు.

● వర్షాలతో రైతుల ఆందోళన

శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షంతో వెనకచిక్కి వస్తున్న పునాస మామి డి, మంగుమచ్చ లతో నాణ్యత దెబ్బతిని రేటు పడిపో తుందని రైతులు ఆందో ళన చెందుతున్నా రు. అంతేకాక రెండోదశ కాపునకు పూతలు కూడా వస్తున్నాయి. వర్షంతో పూతలు పూర్తిగా దెబ్బ తింటాయని, పూత లు నిలబడాలని ఇప్పటికే రూ. వేలు ఖర్చుపెట్టి పురుగు మం దులు పిచి కారీ చేసిన రైతులు నష్టపో తామని అంటు న్నారు.

అభివృద్ధి పేరుతో అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగింత

- అంతరిస్తున్న ఆదివాసీల మనుగడ
- హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 1: దేశంలోని అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నా యని, దీంతో అడవులను నమ్ముకున్న ఆదివాసీల జీవనం మను గడ అంతరించి పోతున్నదని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ అన్నారు. నెల్లూరు నగరంలోని పుర మందిరంలో ఆదివారం ఆదివాసీల దక్షిణాంధ్ర ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పర్యావరణ విధ్వంసంపై ప్రశ్నించిన ఆదీవాసీ నాయకులను, ప్రభుత్వం తీవ్రవాదుల పేరుతో చంపేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో ఆదివా సీలపై ప్రభుత్వాలు కక్ష కట్టి సైనికచర్య ద్వారా 192 మంది చంపడమేకాక, వేలాదిమందిని అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అడవుల్లోని ఆదివాసీలు కూడా భారతీయులేనని, వారి హక్కులను పరిరక్షించేందుకు మేధావులంతా కలిసి రావాలని కోరారు. ఆదివాసీ హక్కుల పోరాట వేదిక కో-కన్వీనర్ జే బాబు మాట్లాడుతూ అడవులపై జరుగుతున్న విధ్వంసాన్ని ఆపకపోతే పర్యావరణం దెబ్బతిం టుందన్నారు. ఈ సందర్భంగా పురమందిరం నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సదస్సులో ప్రజా కళామండలి కళాకారులు సందేశాత్మక గీతాలు ఆలపించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఆదివాసీ సంఘం నాయకులు సిద్ధార్థ, దొరబాబు, పలు ప్రజాతంత్ర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న చిలుకా చంద్రశేఖర్

- పుట్టి ధాన్యానికి రూ.4 వేల తగ్గింపు
- ఓ వైపు చిరుజల్లులు.. మరోవైపు తుఫాన్ భయం
- ఆందోళనలో అన్నదాతలు

దిగజారిన ధరతో రైతు దిగాలు



కాగులపాడు రోడ్డులో లారీకి లోడ్ చేస్తున్న ధాన్యం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు1: జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో రెండో పంట కింద రైతులు వరిసాగు చేశారు. అయితే ఐదురోజులుగా ధాన్యానికి ధర తగ్గుతూ వస్తున్నది. ఆదివారం పుట్టికి రూ. 4,500 నుంచి 4000 వరకు దిగజారింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తీరా వరికోతలు సమ యంలో ఓ వైపు చిరుజల్లులు, మరో వైపు తుఫాన్ హెచ్చరికలు రైతులను భయాందోళనకు గురిచేశాయి. వరికోతలు ప్రారంభమై నిండా 10రోజులుకూడా కాలేదు. మిల్లర్లు, దళారులు మిలాఖత్ అయి పుట్టి రూ. 21వేలతో ప్రారంభమైన ధాన్యం ధరను శనివారానికి రూ. 17వేల నుంచి రూ. 16,500లకు దిగజార్చారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి పడిపోయిన ధాన్యం ధరలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● కోసినా, కోయకపోయినా సమస్యే

వరి కోయాలంటే ధాన్యానికి గిట్టుబాటు ధర లేదనే బాధ ఓ వైపు, కోయకుంటే తుఫాన్ ముప్పు ఉందనే భయం మరోవైపు వేధిస్తున్నది. మిల్లర్లు, దళారులు చూస్తే ధర తగ్గించి అడుగుతున్నారు. ఏమీ చేయలేక రోడ్డుపై ధాన్యం పోసుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. కాగా రెండురోజులుగా ఈదురుగాలులు, వర్షానికి కొన్ని ప్రాంతాల్లో వరిపైరు నేలవాలింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి.

- ముంగర మల్లయ్య, కౌలురైతు, జొన్నవాడ

అభివృద్ధి పనులపై ఇంత నిర్లక్ష్యమా ?

- సోమశిల ఇంజనీర్లు, కాంట్రాక్టరుపై మంత్రి ఆనం మండిపాటు
- సీఎంవోకు తెలిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- అల్పపీడనంపై అధికార యంత్రాంగం అప్రమత్తం
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం, సెప్టెంబరు 1 : సోమశిల జలాశయం ముందు జరుగుతున్న అప్రాన్ పనులు చూసి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విస్తుపోయారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై ఇంత నిర్లక్ష్యమేమిటని ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. సోమశిల ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. తొలుత అతిథిగృహంలో జలవనరులశాఖ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు ముందు జరుగుతున్న అప్రాన్ పనులను పరిశీలించారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై ఎస్ఈలు వెంకటరమణారెడ్డి, రమణారెడ్డి, ఈఈ దశరథరామిరెడ్డిని గట్టిగా ప్రశ్నించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పనులను నిర్లక్ష్యం చేసిందని, చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వలేదన్నారు. ఈక్రమంలో సోమశిల దుస్థితిని సీఎం చంద్రబాబుకు వివరించగా, ఆయన స్పందించి సోమశిలను పరిశీలించి, త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కాంట్రాక్టరు మాత్రం ఈపనులను నత్తనడకన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 రోజుల ముందు పనులు ప్రారంభించగా, నేటికి 45 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాల్సి ఉండగా, రెండు వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు కూడా పూర్తిచేయలేదని పేర్కొన్నారు. ఇంజనీర్లను ప్రశ్నిస్తే కాంట్రాక్టరు పోకడలు చూశాకా తాము బాధ్యత తీసుకోలేమని చెబుతున్నారని ఆనం తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో సోమశిలకు భారీ వరదలు వచ్చే సూచనలు ఉన్నాయని, ఈ విపత్కర పరిస్థితిని అధిగమించాలంటే పనులు త్వరగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. అత్యవసరంగా కాలువ ప్రొటెక్షన్ వాల్ పనులు చేయాల్సి ఉండగా, ఇంతవరకు చేయలేదన్నారు. జిల్లా రైతాంగాన్ని, ప్రాజెక్టును కాపాడుకోవాలన్నది తమ అభిమతమని, పనుల నిర్లక్ష్యంపై సీఎంవో, ఇరిగేషన్ మంత్రి కార్యాలయానికి సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, టీడీపీ నాయకులు గిరినాయుడు, మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఎం. జనార్దన్‌రెడ్డి, రాపూరు సుజాతమ్మ, శాకమూరి సుబ్బారావు రాపూరు సుబ్బారెడ్డి, మనోజ్‌రెడ్డి, చల్లా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్రాన్ పనుల నిర్లక్ష్యంపై ఇంజనీర్లను ప్రశ్నిస్తున్న మంత్రి ఆనం

● అల్పపీడనంపై యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కురుస్తున్న వర్షాలపై ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు అధికారులను సీఎం చంద్రబాబు అప్రమత్తం చేశారని, మూడు రోజుల నుంచి సీఎం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నీ జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఉన్న అన్నీ ప్రాజెక్టులకు వచ్చే వరద తీరుపై సీఎం అంచనా వేస్తూ ఇంజనీర్లకు సూచనలు చేస్తున్నారని చెప్పారు. ద్రోణి ప్రభావం తగ్గే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కోరారు.

సోమశిలకు పెరిగిన వరద ప్రవాహం



సోమశిలకు చేరుతున్న వరద నీరు

సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం 20,075 క్యూసెక్కుల వస్తుండగా 37.072 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కృష్ణాజలాలతోపాటు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కడప, కర్నూలు జిల్లాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సోమశిలకు వచ్చే ప్రవాహంలో మార్పు కనిపి స్తున్నది. సోమవారం సాయంత్రానికి వరద మరింత పెరగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఉపనదులు కందు, సగిలేరు నుంచి పెన్నాకు వరద నీరు చేరుతున్నది.

గణేష్ ఉత్సవాలకు 'సింగిల్ విండో' అనుమతులు : ఎస్పీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 1: వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి అన్ని రకాల అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసిందని ఎస్పీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణంగా ఉత్సవాల నిర్వహణకు అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ) తీసుకోవాల్సి ఉంటుందని, అయితే ఉత్సవాల నిర్వాహకులు ఆయా శాఖల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించిందని తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలను నిర్వహించే వారు ముందుగా 7995095800 నెంబరుకు వాట్సాయాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలని, వెంటనే లింక్ వస్తుందని, దానిని క్లిక్ చేస్తే ఓటీపీ వస్తుందని, ఆ తర్వాత దరఖాస్తును పూర్తి చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. పోలీసు వారు వెరిఫికేషన్ తర్వాత సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు అవుతాయని తెలిపారు. https://ganeshutsav.nvt వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే వారు కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశము, ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుందని, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు... వంటి వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వెళుతుందని, ఆయన ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్‌శాఖల సిబ్బందితో కూడిన బృందం పరిశీలన జరిపి క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. ఆ క్యూఆర్‌కోడ్‌ను లేమినేషన్ చేసి ఉత్సవాలు నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా గణపతి మండప నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ సూచనలు పాటించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు.

నిర్వాహకులకు సూచనలు

- గణపతి మండపానికి అమర్చిన విద్యుత్ తీగలు ఎవరూ అనవసరంగా ముట్టుకోకుండా చూడాలి. షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎక్కువ వేడిని ఉత్పత్తి చేసే బల్బులు, కవర్ లేని హాలోజెన్ బల్బులు వాడకూడదు.
- కనీసం ముగ్గురు వలంటీర్లు రాత్రి పూట మండపంలో నిద్రించాలి.
- మండపాల సమీపానికి పందులు, కుక్కలు, ఇతర జంతువులు రాకుండా నిరోధించాలి. మండపం స్టేజీ కింద ఖాళీ స్థలాన్ని చెక్కతో మూసి ఉంచాలి.
- మండపం వద్ద బాణాసంచా, అగ్నికి కారణమయ్యే వస్తువులు ఉంచరాదు.
- మండపము వద్ద జరిగే కార్యక్రమాలు రోడ్డుపై వెళ్లే వారికి అసౌకర్యం కలిగించకుండా చూసుకోవాలి. ఒక వలంటీరు జనసమూహమును క్రమబద్ధీకరించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి.
- మండపంలో విగ్రహము వద్ద వెలిగించి ఉంచే నూనె దీపాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- మండపం వద్ద కొత్త వస్తువులు, బ్యాగ్లు, బ్రీఫ్ కేసులు, బొమ్మలు, ఇతర అనుమానాస్పద వస్తువులు ఉంటే పరిశీలించి వెంటనే సంబంధిత పోలీసులకు తెలియజేయాలి.
- మండపం దగ్గరలో ఎలాంటి వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.
- కీడు తలపెట్టే వ్యక్తులపై దృష్టి ఉంచి వారిని దూరంగా ఉంచడమే కాకుండా అలాంటి వారి గురించి పోలీసు సిబ్బందికి తెలియజేయాలి.
- లౌడ్ స్పీకర్లను కచ్చితంగా రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగించరాదు.
- మండపాల వద్ద పేకాట ఆడకుండా, మత్తు పదార్థాలు సేవించకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- మండపం వద్ద ఇసుక బస్తాలను, నీటి బక్కెట్లను అగ్ని నిరోధకముగా ఉంచుకోవాలి.
- సోషల్ మీడియా, వాట్సాప్ మాధ్యమాల ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దు, వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు ఫార్వార్డ్ చేయకూడదు.
- అత్యవసర సమయాల్లో 112 నెంబరునుగానీ, పోలీసులనుగానీ సంప్రదించాలి.

ఈనెల నుంచే అర్చకుల వేతనాల పెంపు

- ఆలయాల అభివృద్ధికి పెద్దపీట
- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డిలను పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

సంగం: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రం లోని 5,400 ఆలయాలకు ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా ఇచ్చే రూ.5వేలను ఈనెల నుంచే రూ.10 వేలు అందజేస్తా మని, అలాగే రూ.50వేలకు పైగా ఆదాయం కలిగిన ఆలయాల్లోని అర్చకులకు ఇచ్చే రూ.10వేలను రూ.15 వేలుకు పెంచినట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి సంగం మండలం వంగల్లు కామాక్షిదేవి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయ మహా కుంభాభిషేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. టీటీడీ నుంచి ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ఏడు పెద్ద ఆలయాలతో పాటు 6ఏ కేటగిరికి చెందిన 231 దేవాలయాల్లో ఆహ్లాదకర వాతావరణం, భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నూతన ఆలయాలకు ఇచ్చే రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని రూ.20 నుంచి రూ.25లక్షలు లోపు అందించాలని సీఎం ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆలయాలన్నీ సరికొత్త శోభను సంతరించుకోనున్నామని తెలిపారు. అంతకుముందు ఆలయానికి విచ్చేసిన మంత్రి, ఎంపీలకు అర్చకులు, స్థానిక నాయకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదనంతరం వారు వనమహోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డీఎఫ్‌వో చంద్రశేఖర్, తహశీల్దారు సోమ్లానాయక్, ఆలయ చైర్మన్ రఘురామయ్య, ఎండెమెంట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, దాతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి



రైలు పట్టాలపై గుర్తించిన యువకుడి మృతదేహం

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 1: నెల్లూరులోని సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కట్టపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ జీ మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 30 నుంచి 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై తెలుపురంగు ఫుల్‌హ్యాండ్స్ టీషర్ట్, గ్రే కలర్ లోయర్ ఉన్నాయి. కుడిచేతిపై భవాని అని ఇంగ్లీష్‌లో పేరు రాసి ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మురుగు కాలువలో మృతదేహం



మురుగు కాలువ నుంచి వెలికి తీసిన మృతదేహం

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 1: నెల్లూరులోని ప్రశాంతి నగర్ సెంటర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారి పక్కన మురుగు కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివా రం స్థానికులు గుర్తించి నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440796306, 9440796310 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	102
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	212
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6896
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 89.00

ఎదుగుదలకు కీలకం పౌష్టికాహారం



బరువు తక్కువ చిన్నారితో తల్లి



జీజీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూ విభాగంలో చికిత్స పొందుతున్న అవయవ లోపాల చిన్నారులు

- పుష్టికరమైన ఆహారం అందక తల్లులు, చిన్నారుల మృతి
- ఆహార పదార్థాలపై ప్రజలకు అవగాహన ఏది ?
- జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు 7వరకు నిర్వహణ

నెల్లూరు(వైద్యం) సెప్టెంబరు 1: పౌష్టికాహారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. శరీరానికి అవసరమైన పౌష్టి కాహారం అందక జిల్లాలో ఎంతో మంది చిన్నారులతోపాటు తల్లులు మృత్యువాత పడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 70 మంది చిన్నారులు, 17 మంది తల్లులు మృత్యు వాత పడ్డారంటే జిల్లాలో గర్భిణులు, చిన్నారుల పరిస్థితి ఎలాఉందో తెలుస్తుంది. జిల్లాలోని 2934 అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్లలోపు 1,33,207 మంది చిన్నారులకు, 13,819 మంది గర్భిణులకు, 11,503 మంది బాలింతలకు పౌష్టికా హారం ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 30 పడకలతో ప్రత్యేక పౌష్టికాహార కేంద్రం ఉంది. అలాగే 50 పడకలతో ప్రత్యేక ఎస్ఎన్‌సీయూను ఏర్పాటు చేశారు. ఇక్కడ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా చికిత్సలు అందుబాటులో ఉన్నా ప్రైవేట్‌పరంగా కూడా ఎన్నో ఆసుపత్రులు చిన్నారులకు, తల్లులకు వైద్య చికిత్సలు అందిస్తున్నాయి. ప్రతిఏటా జిల్లాలో 45వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రులలోనే 12 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. కాగా పౌష్టికాహార లోపంతో ఎక్కువమంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి ఈనెల 7 వరకు జాతీయ పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ పౌష్టికాహారంపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సి ఉంది.

36 శాతంమంది ఎదుగుదల లేదు

పౌష్టికాహారలోపం కారణంగా 36శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తున్నది. ప్రత్యేక వైద్య చికిత్సల ద్వారా వీరికి చికిత్సలు అందించాలి. అలాగే బరువు తక్కువగా ఉన్న చిన్నారులు 32 శాతం మంది జిల్లాలో పుడుతున్నారు. సాధారణంగా 2.50 కిలోల బరువు ఉండాల్సిన చిన్నారులు పౌష్టికాహారలోపం వల్ల కిలో కంటే తక్కువ బరువు ఉంటున్నారు. వీరికి ప్రధాన అవయవాల లోపం కారణంగా ప్రత్యేక చికిత్స అందించాలి. 19 శాతం మంది బక్క చిక్కిన చిన్నారులు జన్మిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2.4 శాతం మంది ఊబకా యంతో పడుతున్నారు. వీటన్నిటికి పౌష్టికాహారం లోపమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వారు ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీ వర్గాలలోనే ఉన్నారు. ఆయా వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే వైద్య ఆరోగ్యశాఖ ప్రచారంలో వెనుకబడటంతో చిన్నారులు, తల్లులు మృతువాత పడుతున్నారు. రక్తహీనత కారణంగా తల్లులు మృతి చెందుతుండగా, యుక్త వయసులోనే అధికశాతం మహిళలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు.

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలంటే...

తల్లులు, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలంటే ఆహారంలో తృణధాన్యాలు, గింజధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులను తీసుకోవాలి. అలాగే గుడ్లు, చికెన్ వంటివి తీసుకోవాలి. ఐరన్, జింక్, అయోడిన్ తదితర ఖనిజ లవణాలు, విటమిన్-ఏ, బీ, సీ తదితర సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండే పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. ఇదిలాఉంటే చిన్నారుల్లో పౌష్టికాహార లోపానికి శిశువుకు తల్లిపాలు తగినంత అందక పోవటమే కారణమని తెలుస్తున్నది. పేదరికం వల్ల ఎదిగే వయసులో తగిన పౌష్టికాహారం అందటం లేదు. ప్రస్తుత పరిస్థితిలో ఆరునెలలలోపు 55 శాతం మందికే తగినన్ని తల్లిపాలు అందుతున్నాయంటే జిల్లాలో పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది.పౌష్టికాహార లోపం వల్ల కండరాలు పెరగక బాగా బక్కచిక్కి పోవటం, ఎదుగుదల లోపించి తగినంత బరువు పెరగక పోవటం, పెద్దయిన తర్వాత మధుమేహం, బీపీ, గుండె జబ్బులు, ఎముకల బలహీనత, కేన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.

గర్భిణులు, బాలింతలు మంచి ఆహారాన్ని తీసుకోవాలి



గర్భిణులు తగిన పౌష్టికాహారం తీసుకోవాలి. రక్తహీనతకు గురయి ప్రసవ సమయంలో మృతువాత పడకుండా చూసుకోవాలి. యుక్త వయసు నుంచే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పురిటి పిల్లలకు తల్లుపాలు సమృద్ధిగా అందించేలా చూడాలి. పుట్టిన బిడ్డకు ముర్రిపాలు తప్పనిసరిగా అందించాలి.

- డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, గైనకాలజిస్ట్

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారుల్లో ఎక్కువశాతం మరణాలకు పౌష్టికాహారం లోపమే కారణం. అలాంటి వారికి ప్రత్యేక చికిత్స అందించాలి. లేదంలే చిన్నారులు మృత్యువాత పడక తప్పదు. చిన్నారులు పుష్టిగా ఎదగాలంటే వారికి ఆహారంలో తగినంత పోషకాలు అవసరం. వారు తీసుకునే ఆహారం చాలా తేలికగా జీర్ణం అయ్యేలా చూసుకో వాలి. పప్పుధాన్యాలు, గింజధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకు కూరలు కాలానికి తగ్గ పండ్లు, గుడ్లు, పాలు. పెరుగు తప్పనిసరిగా ఉండాలి.

- డాక్టర్ జయచంద్రనాయుడు, జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య నిపుణులు

కోర్టు ఆదేశాలతో ఇద్దరు అధికారులపై కేసు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 1 : హైకోర్టు ఆదేశాలతో ఐటీడీఏ పూర్వ పీవో, దర్గామిట్ట స్టేషన్ పూర్వ ఇన్‌స్పెక్టర్‌పై బాలాజీనగర్ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి 2017వ సంవత్సరంలో లోన్‌లో కారును తీసుకున్నారు. కరోనా విపత్తు సమయంలో లోనుకు సంబంధించిన నగదును చెల్లించలేకపోయారు. గతేడాది డిసెంబరు 7వ తేదీన ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అప్పటి ఐటీడీఏ పీవో మందా రాణి, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావు పెంచలయ్య కారును తీసుకెళ్లారు. దీనిపై బాధితుడు హైకోర్టును ఆశ్రయించి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. పెంచలయ్య కారును అన్యాయంగా ఎత్తుకెళ్లడాన్ని కోర్టు తప్పు పడుతూ అందుకు బాధ్యులైన నాటి ఐటీడీఏ పీవో, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు చేయాలని బాలాజీనగర్ పోలీసులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఇద్దరు అధికారులపై కేసు నమోదు చేశారు.

లాడ్జిలో జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 1: లాడ్జీలో రూములు అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న జూదరులను చిన్నబజారు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావుకు అందిన సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి నగరంలోని ఓ లాడ్జీపై దాడి చేశారు. పేకాడుతున్న 14 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.38,650 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ నెల్లూరు నగరంలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతున్న వాహనాలు

వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్‌పై రాకపోకల పునరుద్ధరణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 1 : నెల్లూరులోని వెంకటేశ్వరపురం వద్ద ముంబయి జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎట్టకేలకు వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ఈ వంతెనపై రోడ్డు కుంగడంతో మరమ్మతుల కోసం జూలై 13 నుంచి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. మరమ్మతులు పూర్తవడంతో ఆదివారం బుచ్చి, కడప వైపు వాహనాలను అనుమతించారు. దీంతో ఒకటిన్నర నెలగా అవస్థ పడుతున్న ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీటీఎఫ్ నాయకుల నిరసన

- పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 1: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లపాటి సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో సంఘం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబరు 1వ తేదీన సీపీఎస్ అమలు రోజును విద్రోహ దినంగా పాటిస్తూ నల్లరిబ్బన్లు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ అనేది భిక్ష కాదని అది ఉద్యోగి హక్కు అన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు 117జీవోను వెంటనే రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యా పోస్టులను భర్తీ చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, అయ్యన్న, షేక్ సందానీబాష, పెంచలయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పరిరక్షణ జేఏసీ ఏకగ్రీవం



జేఏసీ కార్యవర్గం

నెల్లూరు (హరనాథపు రం), సెప్టెంబరు 1 : మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీ కరణ పరిరక్షణ జేఏసీ కమిటీని ఆదివారం నెల్లూరులోని బాబు జగ్జీ వన్‌రామ్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా పందిటి సుబ్బ య్య, డాక్టర్ వీ హనుమంతరావు, కుడుముల సుబ్బారావు, జీవీ కృష్ణయ్య, అంకి మనోజ్ ను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా విశ్రాంత తహసీల్దార్ పీ జనార్దనరావు, కో-కన్వీనర్‌గా కొమ్మల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శేఖర్, కోశాధికారిగా సితారి రత్నం, మహి ళా కార్యదర్శిగా పల్లాల సునీత, డీ శోభారాణి, న్యాయ సలహాదారులుగా బద్దిపూడి రవీంద్ర, కుడుముల రవికుమార్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా వేగూరు విజయ కుమార్, సహాయ కార్యదర్శులుగా పీ సతీష్, తాటిపర్తి రఘు, టీ బద్రి తదితరులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

విపత్తు నిర్వహణపై ప్రత్యేక కోర్సు : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 1: జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి యంగ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోందని, అర్హులైన వారు విపత్తు నిర్వహణ నిపుణులుగా తయారయ్యేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విపత్తు నిర్వహణలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు చేసిన 35 ఏళ్లలోపు వారికి ప్రత్యేకమైన అభ్యాసన కార్యక్రమాన్ని అందించడమే లక్ష్యంగా మూడేళ్ల కాలవ్యవధితో ప్రోగ్రాంను రూపొందించినట్లు తెలిపారు. సంవత్సరానికి 400 మంది చొప్పున రెండు సంవత్సరాలకు 800 మంది సమర్థులను గుర్తించి విపత్తు నిర్వహణలో కొనసాగించేలా ఈ ఫెలోషిప్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలతో త్వరలో జిల్లా ఎంప్లాయిమెంట్ విభాగం ద్వారా ప్రకటన వెలువడుతుందని తెలిపారు. ఆసక్తి గల వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: బీటీఏ నిరసన



ఆందోళన చేస్తున్న బీటీఏ నేతలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 1 : ఉద్యోగుల పాలిట భూతం వంటి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని బీటీఏ నేతలు డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1 ఉద్యోగుల పాలిట విద్రోహ దినాన్ని పురస్కరించుకుని నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ 2004 సెప్టెంబరు 1వతేదీన సీపీఎస్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. నాటి నుంచి ఉద్యో గులకు, ఉపాధ్యాయుల కుటుంబాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. దశాబ్ద కాలంగా దీనిపై ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకుండా జీపీఎస్, యూపీఎస్ విధానాలను తీసుకు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి ఈ విధానాన్ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీపీఎస్, యూపీఎస్ జీవో పత్రాల నకళ్లను తగులబెట్టారు. ఈ కార్యక్రమంలో బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, నాయకులు మాల్యాద్రి, మనోజ్, బ్రహ్మా య్య, తిరుపతయ్య, రఘు, ఖాజా రహంతుల్లా, మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో....

ఎస్టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై అశోక్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గొడ్డలి పెట్టుగా ఉన్న జీపీఎస్, యూపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ రాజ మనోహర్, ఆర్థిక కార్యదర్శి కే నరసింహ, అసోసియేట్ అధ్యక్షుడు పీ సుమన్, ఉపాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, కల్పనాదేవి, దీప్తి దితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



బస్సు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డ యువకులు

ముత్తు కూరు, సెప్టెంబరు 1 : ఆర్టీసీ బస్సు, మోటారు బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకు లు తీవ్ర గాయా లకు గురైన సంఘటన బ్రహ్మ దేవం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరా లు ఇలా ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టులో విధులు పూర్తిచేసుకుని నెల్లూరుకు మోటారుబైక్‌పై తోట మురుగేష్, మరో యువకుడు వెళ్తుండగా నెల్లూరు నుంచి వస్తున్న కోట ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే యువకు లిద్దరికీ తీవ్ర గాయాల య్యాయని, తాము జీజీహెచ్‌లో ఏమీ చేయలేమని, ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చుకోమని చెప్పి చికిత్స చేసేందుకు జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది నిరాకరించారు. దీంతో పేదవాళ్లయిన తాము ప్రైవేటు వైద్యశాలకు ఎలా వెళ్లగలమంటూ బాధితుల కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేశాయి. ముత్తుకూరు ఎస్‌ఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఆర్టీసీ బస్సును పక్కన పెట్టించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కాగా, ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 1: ముళ్లపొదల్లోకి కారు దూసుకువెళ్లడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని తిక్కవరప్పాడు వద్ద ఆదివారం ఉదయం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఇస్కపాలెం గ్రామానికి చెందిన వల్లూరు బాబులురెడ్డి నెల్లూరు నుంచి కారులో ఇస్కపాలెంకు బయలుదేరాడు. తిక్కవరప్పాడు సమీపంలో మూడు జింకలు రోడ్డు దాటుతుండగా వాటిని తప్పించబోయి కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారు అద్దాలు పగలడంతో బాబులురెడ్డికి గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసంపూర్తి నిర్మాణాలు



ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

- ఉదయగిరిలో సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు
- ఇరుకు, శిథిలావస్థ గదుల్లో సిబ్బంది అగచాట్లు
- పట్టించుకోని అధికారులు



ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవన నిర్మాణం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు గత వైసీపీ ప్రభుత్వం 95సచివాలయాలు, 85విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరు చేసింది. అందులో సుమారు 40భవనాలు అసంపూర్తి నిర్మాణంతో మిగిలిపోయాయి. ఉదయగిరి మండలంలో నేలటూరు, వెంగళరావునగర్, ఉదయగిరి పట్టణంలో సచివాలయాలు, విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దుత్తలూరు మండలంలో నర్రవాడ, నందిపాడు, సీతారామపురం మండలం బాలాయపల్లి, వరికుంట పాడు మండలంలో పది భవనాలకుగాను ఐదు భవనాలు, కొండాపురం మండలంలో పది భవనాలల్లో రెండు, జలదంకి మండలంలో 11భవనాలకు గాను రెండు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏళ్ల తరబడి భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పరాయి పంచన సేవలందించేందుకు ఉద్యోగులు తంటాలు పడుతున్నారు. భవనాలు ఫర్నిచర్, సామగ్రి, మందులు నిల్వ చేసుకునేందుకు వీలు కావడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు నిర్మాణాలను పూర్తి చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

● త్వరలో పూర్తి చేయిస్తాం: శ్రీనివాసరాజు

అసంపూర్తిగా ఉన్న సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరలో పూర్తి చేయిస్తాం. గుత్తేదారులకు బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు రాగానే పూర్తి చేయించి భవనాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- పీఆర్ ఏఈ, ఉదయగిరి

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


చెరువుల ఆక్రమణ!

● ఆయకట్టు రైతుల అవస్థలు, ● పట్టించుకోని అధికారులు

చిట్రగుంట, సెప్టెంబరు 1: బోగోలు మండలంలోని 26 చెరువుల్లో పలు చెరువులు ఆక్రమణలతో కుంచించుకుపోతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులకు సాగు నీరందక అవస్థలు పడుతున్నారు. ఓ వైపు చెరువుల ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గిపోతుంటే, మరోవైపు వర్షాలకు కొట్టుకువచ్చిన మట్టితో చెరువులు పూడిపోతున్నాయి. చెరువుకట్టల లోపల ఆక్రమదారులు గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ లోతైన గోతులు చేస్తున్నారు.



పంట పొలాలుగా మారిన అక్కిలిగుంట చెరువు



ఆక్రమణలకు గురైన తెల్లగుంట తాగేటి చెరువు

దీంతో చెరువులోకి వర్షపు నీరు గోతులోకి చేరుకుని ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అల్లిమడుగులోని తాగేటి చెరువు దాదాపు ఆక్రమణలకు గురైంది. కడనూతల చెరువు ఆక్రమణలు కొంత, పూడుక పేరుకుపోయి మరికొంత విస్తీర్ణం తగ్గింది. బోగోలు చెరువు ఆక్రమణలకు గురికావడంతో కాలువ నీరు చెరువులోకి రావడం కష్టంగా మారింది. కోవూరుపల్లి చెరువును కొందరు ఆక్రమించుకుని లేఅవుట్ వేయగా అధికారులు ఇటీవల తొలగించారు. వర్షాలు కురుసేలోపు అధికారులు యుద్ధప్రాతిపదికన ఆక్రమణలు తొలగిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

అనైతికతకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసియా

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: ఇతరుల హక్కులకు భంగం కలుగకుండా నీతి, నియమాలు పాటిస్తూ అనైతికతకు దూరంగా ఉండాలని జమాతే ఇస్లాం హింద్ మహిళా విభాగం ఉదయగిరి అధ్యక్షురాలు అసియా సూచించారు. ఆదివారం స్థానిక దిలావర్‌భాయ్‌వీధిలోని మదర్సాలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మద్యం, మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి, అశ్లీల, అసభ్యతతో ఉన్న వైబ్‌సైట్‌ల నుంచి యువతను బయటకు తీసుకురావడమే ప్రధాన లక్ష్యమన్నారు. పాశ్చాత్య సంస్కృతుల నుంచి మన యువతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిఒక్కరికీ ఈ సందేశం అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సభ్యులు అల్‌సానియా, అమీరా, మహమ్మదీ, పర్వీన్, సాదియా, రిహానా పాల్గొన్నారు.

కృష్ణాపురంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ



మర్రిపాడు: శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఆనం, ఎంపీ వీపీఆర్

మర్రిపాడు, సెప్టెంబరు 1: కృష్ణాపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి భూమి పూజ చేసి, శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వైద్యాధికారులు 24గంటలు అందుబాటులో ఉండేందుకు వారికి క్వార్టర్స్ నిర్మిస్తామని, అందుకు పక్కనే మరో ఎకరా భూమిని కేటాయించాలని ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మేకపాటి కుటుంబం సుదీర్ఘకాలంగా రాజకీయంలో ఉండి పదవులు అనుభవిస్తూ సొంత మండలాన్ని అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సోమశిల హైలెవెల్ కెనాల్ పనులు 60శాతం పూర్తి చేశామని చెప్పిన మీరు ఒక్క ఎకరాకైనా నీరు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి సహకారంతో హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి చేస్తామన్న మాటను ని లబెట్టుకుంటామన్నారు. మండల ప్రజలు బెంగుళూరు, చెన్నైలకు వలస వెళ్లి జీవిస్తుంటే మీ రేమో ఇతర దేశాల్లో కాంట్రాక్టు పనులు చేసుకుంటున్నారని విమర్శించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మాట్లాడారు. వైసీపీ పాలకులు రూ.60వేల కోట్ల మందులను వివిధ కంపెనీల వద్ద కొనుగోలు చేసి అప్పు చేసినట్లు కంపెనీల నిర్వాహకులు ఇటీవల సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళితే వారికి రూ.500కోట్లను విడుదల చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం బ్రాహ్మణపల్లి ఎస్సీ, బీసీ కాలనీల్లో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి ప్లాం ట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, తాళ్లూరి గిరినాయుడు, పుట్టం బ్రహ్మారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు.

కావలిని కనకపట్నం చేయడమే లక్ష్యం

● ప్రజల రక్తం తాగిన జలగ ప్రతాప్‌కుమార్‌రెడ్డి ● తుమ్మలపెంట పాదయాత్ర విజయవంతం ● ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి





తుమ్మలపెంటరోడ్డు శంకుస్థాపనకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి/కావలి రూరల్, సెప్టెంబరు 1: మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నియంతృత్వంతో గత ఐదేళ్లల్లో కరప్షన్‌కు కేరాఫ్‌గా మారిన కావలిని తిరిగి కనకపట్నంగా మార్చడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురై ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిన తుమ్మలపెంట రహదారి నిర్మాణానికి ఆదివారం చేపట్టి శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా కావలి నుంచి చేపట్టిన పాదయాత్ర విజయవంతం అయింది. ఈ పాదయాత్ర ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సుమారు 5 వేల మందితో కావలి పట్టణం తుమ్మలపెంటరోడ్డులోని భారత్ గ్యాస్ వద్ద నుంచి తుమ్మలపెంట వరకు 9.కిలో మీటర్లు సాగింది. రూ.14.76 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు రూరల్ మండల మహిళలచే శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనపోయి రామ రాజ్యం వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొట్టమొదట 1995 సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే తుమ్మలపెంట రోడ్డుకు మోక్షం కల్పిస్తూ శంకుస్థాపన చేశామన్నారు. ఎన్నికల్లో మాట ప్రకారం దశాబ్దాల కాలం నుంచి నిర్లక్ష్యానికి అంతిమ యాత్ర నిర్వహించి రోడ్డు పనులు ప్రారంభించామ న్నారు. 2018లో నారా లోకేష్ తుమ్మలపెంటకు వచ్చినప్పుడే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే 2019లో వైసీపీ అధికారం లోకి రావడంతో రాక్షసుడైన అప్పటి ముఖ్యమంత్రి జగన్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కమిషన్ల కోసం కాంట్రాక్టర్‌ను బెదిరించడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయిం దన్నారు. కావలికి ఓ పక్కన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, మరో పక్కన ఎయిర్ పోర్టుతో పాటు 5700 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకట్రావ్, పాలడుగు రంగారావు, నాయుడు రాంప్రసాద్, పాలడుగు రంగారావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, పోతుగంటి అలేఖ్య, రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట శ్రీహరినాయుడు, కొండూరు పాలిశెట్టి, జనసేన నాయకుడు అళహరి సుధాకర్, బీజేపీ నాయకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



తొట్టెలో పేరుకపోయిన చెత్తను తొలగిస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే కోనకాలువ, తొట్టె ప్రాంతంలో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం నాయకులతో కలిసి శ్రమదానం నిర్వహించారు. తొట్టిలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. అనంతరం కాలువ వెంట నీటి సరఫరాకు అ డ్డంకిగా మారిన ఆకులు, చెత్తను తొలగించారు. కార్యక్ర మంలో గూడూరు వెంకటేశ్వరరావు, రంతుజానీ, బాబు, మాబాషా, మట్ల రామయ్య, లక్ష్మయ్య, అర్షద్ పాల్గొన్నారు.

సమాచారం సరిచేయరూ..!



బదిలీ అధికారుల పేర్లతో ఉన్న సమాచారం

వరికుంటపాడు, సెప్టెంబరు 1: స్థానిక వెలుగు కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించి ఏర్పాటు చేసిన సమాచార బోర్డులో వివరాలు తప్పులమయంగా ఉండటం అక్కడి అధికారుల పనితీరుకు నిదర్శంగా మారుతోంది. గతంలో ఉన్న అధికారులు బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా నేటికీ ఆ బోర్డులో అప్పటి అధికారుల పేర్లు, ఫోన్లు నంబర్లే దర్శనమిస్తుండడం గమనార్హం. దీంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజలు విషయం తెలియక ఆ బోర్డులో పేర్లు ఉన్న బదిలీ అధికారులకే ఫోన్లు చేసి విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచార బోర్డును సరిచేసి సమగ్ర సమాచారం నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాగునీటి కోసం తప్పని తిప్పలు



నిరుపయోగంగా ఉన్న వాటర్ కూలర్

వరికుంటపాడు, సెప్టెంబరు 1: స్థానిక వెలుగు కార్యాలయానికి పనులపై వెళ్లిన ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. నిత్యం ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు, ప్రజలతో రద్దీగా ఉండే ఆ కార్యాలయంలో దాహం తీర్చుకు నేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. దాతలు అందించిన వాటర్ కూలర్ నెలల తరబడి మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో చేసేదేమిలేక ఉద్యోగులతో సహా అటుగా వెళ్లిన ప్రతి ఒక్కరూ దప్పిక తీర్చుకునేందుకు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

● ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

కందుకూరు, సెప్టెంబరు 1: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని(సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన టీచర్స్ అసోసియేషన్, సీపీఎస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహనరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పట్ల సీపీఎస్ ఒక భూతంలా ఉందని, 30 ఏళ్ల ఉద్యోగం చేశాక పెన్షన్ తీసుకునే పరిస్థితి లేకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ అబ్దుల్లా, సంగా మహేంద్ర, ధన్యాసి కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, కోటయ్య, అంజయ్య, వలేటి మాలకొండయ్య, మద్ది రంగారావు, బత్తల కేశవ, శ్రీనివాసులు, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కేవై కోటయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో...



సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలిటౌన్ : సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం తహసీల్దార్డు కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితాలకు సీపీఎస్ గొడ్డలిపెట్టని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న యుపీఎస్‌ను కూడా ఉపసంహరించుకోవాలని వెంటనే ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధికార పత్రిక ఉపాధ్యాయ సంపాదక వర్గ సభ్యుడు గురునాథశర్మ, రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బిళ్ల కృష్ణయ్య, నేతలు కటారి నరసింహారావు, రామారావు, రఘునాథరెడ్డి, బూచి మధుసూదన్‌రావు, సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు నిధుల మంజూరుపై హర్షం

కొండాపురం, సెప్టెంబరు 1: ఉదయగిరిలోని డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు హర్షించదగ్గ విషయమని బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున పేర్కొన్నారు. ఈ కళాశాల అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలంటూ గతేడాది మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావులు కేంద్ర మానవ వనరులమంత్రికి వినతిపత్రం అందజేశారని పేర్కొన్నారు. దీనికి స్పందించిన కేంద్రప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు కేటాయించిందని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులు

జలదంకి, సెప్టెంబరు 1: మండలంలోని అన్నవరంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రాల సురేష్, సిద్ధు, పి.రామక్రిష్ణారెడ్డి, పత్తి సుబ్బారావు, సమాల్‌బాషా, సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ఇంట్లోనే కుటుంబసభ్యులతో నిరసన వ్యక్తం చేస్తున్న సుబ్బారెడ్డి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 1: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు గాజుల సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని అమలు చేసి 20ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి తమ నివాసంలో ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీలుగా పదవులు నిర్వహించే వారికి పెన్షన్ ఇవ్వడం, 35ఏళ్లు ఉద్యోగం చేస్తే వారికి పెన్షన్ లేకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ తమకు వద్దని, ఓపీఎస్ ముద్దన్నారు. మా నాన్నకు పెన్షన్ లేకుం టే.. నా జీవిత మంతా టెన్షన్... మా నాన్నకు పాత పెన్షన్.. నా భవిష్య త్తుకు నో టెన్షన్ అంటూ పిల్లలు ప్లేకార్డులు ప్రదర్శించారు.

నిబంధనలు మరచి బొగ్గు బట్టీల నిర్వహణ

● అనుమతి పొందిన చోట కాకుండా అనువైన ప్రాంతంలో నిర్వహణ



బట్టీల వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న బొగ్గు

మర్రిపాడు, సెప్టెంబరు 1: మండలంలోని శెట్టిసముద్రం, చిలకపాడు, చిన్నమాచనూ రు సమీపంలో బొగ్గు బట్టీల నిర్వాహకులు నిబంధనలను లెక్క చేయకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఒకటి.. రెండు బట్టీల నిర్వహణ పేరుతో గోరంత అనుమతులు పొంది కొండంత వ్యాపారం సాగిస్తున్నారు. అడవులను సైతం లెక్క చేయకుండా, పచ్చని చెట్లను నరుకుతూ బొగ్గు బట్టీలకు తరలిస్తున్నారు. ఒక్కో ప్రదేశంలో 5నుంచి 8బట్టీల వరకు అమర్చి, అనుమతి పొందిన పొలంలో కాకుండా అక్రమార్కులకు అనువైన స్థావరంలో నిర్వహిస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ఆరాతీస్తే తమకు అన్నీ అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు. అడవి కర్ర వంటివి బట్టీల వద్ద ఉందని అధికారులకు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే 2వేలు, రూ.మూడు వేలు చలానాలు కట్టించుకొని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పొగాకు సీజన్ ప్రారంభమైతే పొగాకు క్యూరింగ్ చేసుకునేందుకు ఎలాంటి కర్ర దొరక్క రైతులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. దొరికిన చోట కొనాలంటే టన్ను ధర ఆకాశాన్ని అంటుతోంది. బొగ్గు బట్టీల నిర్వహణతో రైతులకు సైతం కర్ర దొరకటం లేదు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటం వలనే ఈ తతంగం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు అనుమతులు ఇస్తుండటం ఒక ఎత్తైతే, బొగ్గు సామర్థ్యాన్ని సైతం తక్కువ చూపి చలానాల రూపంలో ప్రభుత్వానికి అందాల్సిన ఆదాయానికి తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు అన్నదాన కార్యక్రమం

లింగసముద్రం, సెప్టెంబరు 1 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా లింగసముద్రం పంచాయతీలోని బలిజపాలెంలో సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో చెప్పారు.

ఎస్‌ఐకి టీడీపీ నేతల సన్మానం



ఎస్‌ఐ సుభానీని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

లింగసముద్రం, సెప్టెంబరు 1 : లింగసముద్రం ఎస్సై షేక్ మహమ్మద్ సుభానీని టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, పెదపవని గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, పలువురు టీడీపీ నేతలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ నారాయణ, ఎం సుధాకర్, కె సుబ్బులునాయుడు, మాజీ ఎంపీటీసీ ఎస్ కొండరావు, కంచర్ల రవీంద్ర, షేక్ రఫీ, షేక్ కరీముల్లా, బి సిద్ధయ్య, జనసేన నేత కె దినేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఉలవపాడు, సెప్టెంబరు 1 : మండలంలోని కరేడు ర్యాంపు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అంకమ్మ కథనం మేరకు.. గుర్తుతె లియని 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులో జయరామయ్య విజలాపురం పేరుతో ఫోన్ నెంబ రు రాసిన కాగితం ఉండడంతో దాని ఆధారంగా మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సామాజిక ఆరోగ్యం కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు.

మొక్కలు నాటిన నాయకులు

సీతారామపురం, సెప్టెంబరు 1: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా జనసేన నాయకులు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భోగినేని కాశీరావు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో క్లీన్ ఆంధ్ర- గ్రీన్ ఆంధ్ర ఇనిషియేటివ్ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో, సచివాలయం కార్యాలయాల ఆవరణలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కప్పా ప్రభాకర్ రాజు, పిడుగు రమేష్, వెంగళశెట్టి వెంటయ్య, వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ భాగ్యకుమారి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాయకులు

చేతిపంపు ఎత్తు పెంచండి



నిరుపయోగంగా చేతిపంపు

వరికుంటపాడు, సెప్టెంబరు 1: తూర్పుబో యమడగల గ్రామంలోని ప్రధానవీధిలోని చేతిపంపు నిరుపయో గంగా ఉంది. నీరు రాక నిరుయోగంగా లేదండోయ్.. తాగునీరు వస్తున్నా నివాసాలు, రోడ్డు ఎత్తు పెరగ డంతో చేతిపంపు సగానికి పైగా పూడుకపోయింది. ఈ సమస్యతో చేతిపంపును స్థానికులు వాడుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చేతి పంపు ఎత్తును పెంచి వాడుకలోకి తీసుకొస్తే స్థానికులకు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు.

'నైతికతే నిజమైన స్వేచ్ఛ' ఉద్యమానికి శ్రీకారం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సంస్థ మహిళలు

కావలి, సెప్టెంబరు 1: సమాజంలో జరిగే అనైతిక, అసాంఘిక, అశ్లీల అరాచక, అశాంతి పనులకు వ్యతిరేకంగా నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో జమాతే ఇస్లామీ హింద్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నట్లు ఆ సంస్థ మహిళలు తెలిపారు. స్థానిక జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆది వారం జరిగిన విలేకరుల సమావేశంలో జమాతే ఇస్లాం హింద్ కావలి శాఖ కన్వీనర్ ఫాతిమామహ్మద్ సంస్థ సభ్యులతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకాలను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గోడపత్రికలు అంటిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటా కార్యక్రమాన్ని సెప్టెంబరు 1నుంచి 30 వరకు కొనసాగించనున్నట్లు చెప్పారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ సంస్థ ద్వారా చేసే ఈ కార్యక్రమానికి మహిళామణులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు బుష్రా, నూర్జహాన్, షాహినా, హబీబా, ఇస్మత్, సమయ, షకీలా తదితరులు పాల్గొన్నారు.

డీఎం చానల్‌లో పూడికతీత

చిట్రగుంట, సెప్టెంబరు 1: బోగోలు మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండి పోయిన కడనూతల, కోవూరుపల్లి చెరువులకు సోమశిల జలాలు విడుదల కోసం డీఎం చానల్ పూడికతీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. చెంచులక్ష్మీపురం సమీపంలో కాలువలో పెరిగిన తుంగ, ముళ్లచెట్లు తొలగిస్తున్నారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు తెలిపారు.



పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

ముత్తుకూరులో డంపింగ్ యార్డు ఏర్పాటు కలేనా ?

● మూడేళ్లుగా అమలుకు నోచుకోని ప్రతిపాదనలు ● పేరుకుపోతున్న చెత్త నిల్వలు



ముత్తుకూరులో పేరుకుపోయిన చెత్త నిల్వలు

ముత్తుకూరు, సెప్టెంబరు 1: డంపింగ్ యార్డు ఏర్పాటు కలగా మారిందని, మూడేళ్ల నుంచి యార్డు ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదని ముత్తుకూరు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ముత్తుకూరులో ఏర్పడే చెత్త మొత్తం ప్రభుత్వ కార్యాలయాల వెనుక ఉన్న ఖాళీ స్థలంలోకి తరలిస్తుండడంతో చెత్త నిల్వలు కొండలా పేరుకుపోయి ఈప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. మూడేళ్ల కిందట డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అప్పట్లో పంచాయతీ పాలకులు బోడిసామి కండ్రిగ సమీపంలో మూడు ఎకరాల స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించాలని తీర్మానం చేసి రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు అందజేశారు. దీంతో డంపింగ్ యార్డు నిర్మాణం చేస్తే చెత్త సమస్య తీరిపోతుందని స్థానికులు భావించారు. ఎందుకనో ఆతర్వాత ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. పంచాయతీ తీర్మానం కాగితాలకే పరిమితమైంది. ముత్తుకూరులో ఉండే మాంసం దుకాణాలు, కూరగాయలు, ఇతర దుకాణాల నుం చి నిత్యం వచ్చే చెత్త మొత్తాన్ని ప్రభు త్వ కార్యాలయాల వెనుక ఉన్న ప్రాంతంలో పడ వేస్తున్నారు. ఇళ్లనుంచి సేకరించిన చెత్త, వ్యర్థ పదార్థాలను కూడా ఇక్కడికే తరలిస్తుండడంతో పెద్దఎత్తున చెత్త పేరుకుపోతోంది. దీంతో ఈ ప్రాంతంలో పందుల సంచారం అధికమైంది. డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణకు స్థలం కేటాయిస్తే ఈ సమస్య తీరే అవకాశం ఉంది. రెవెన్యూ, పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి స్థలాన్ని సేకరించి డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టి, చెత్త సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కామాక్షితాయి సేవలో న్యాయాధికారి



న్యాయాధికారికి ప్రసాదాలిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 1: జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారిని ఆదివారం 3వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎల్ తేజోవతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పండితులు స్వామి, అమ్మవారి శేష వస్త్రాలతో వారిని సత్కరించారు. వారివెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ మురళి, అర్చకులు వున్నారు.

ఏఎస్ఐకి సన్మానం

విడవలూరు, సెప్టెంబరు 1: పదోన్నతితో బదిలీపై వెళ్తున్న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ సుల్తాన్ బాషాను ఆదివారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో ఎస్ఐ సాయిప్రసాద్, పోలీసు సిబ్బంది చెన్నకేశవులు, శ్రీనివాసులు, చిన్న పెంచలయ్య, మధు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



హను సేవాసమితి వృద్ధాశ్రమంలో జనసేన నేతలు

పొదలకూరు, సెప్టెంబరు 1 : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల జనసైనికుల ఆధ్వర్యంలో మండలంలోని తాటిపర్తి గ్రామంలోని హను సేవా సమితి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అనీల్‌కుమార్, జనసేన నాయకులు బి యశ్వంత్, నవీన్, ప్రసాద్, రవి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 1: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీరేంద్రబాబు హెచ్చరించారు. మండలంలోని కొత్త కోడూరు బీచ్‌లో ఆదివారం పలు వాహనాలను ఎస్ఐ తనిఖీ చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యంసేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పిల్లలు వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే బీచ్‌లో ఆకతాయిలు అల్లర్లు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పైడేరులో అక్రమంగా మట్టి తవ్వకాలు



ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న అక్రమార్కులు

విడవలూరు, సెప్టెంబరు 1: మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామ సమీపంలో ఉన్న పైడేరు వాగు నుంచి ఆదివారం కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. జేసీబీల సహాయంతో వాగులోని మట్టిని తవ్వి ట్రాక్టర్లు ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న విషయాన్ని స్థానికులు కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆర్ఐ సిరాజ్, వీఆర్వో శ్రీనివాసులు ఆప్రాంతానికి చేరుకోగా అక్రమార్కులు మట్టితవ్వకాలను నిలిపివేసి అక్కడ నుంచి జారుకున్నారు.

సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టొద్దు : కమిషనర్



సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 1: పట్టణంలోని జాతీయ రహదారిపైనున్న సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఫ్లెక్సీలు కట్టొద్దని నగర పంచాయతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. ఫ్లెక్సీలు కట్టడంవల్ల స్తంభాలకు ఏర్పాటుచేసిన తిరంగా విద్యుత్ లైట్లు మరమ్మతులకు గురౌతున్నాయని కమిషనర్ తెలిపారు. ఆదాయం తక్కువగా వున్న నగర పంచాయతీని అభివృద్ధి చేసుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గంగమ్మకు పొంగళ్లు

● అమ్మవారికి వేమిరెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు



గంగమ్మ పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు

కొడవలూరు, సెప్టెంబరు 1: మండలంలో గండవరం గ్రామంలో గంగమ్మతల్లికి పొంగళ్ల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయకమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు ఆలం మాలకొండయ్య, చీకటి రాఘవరెడ్డి, చీకటి ప్రదీప్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కర్తం

కొడవలూరు, సెప్టెంబరు 1: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జనసేన పార్టీ సీనియర్ నేత కర్తం హజరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని గ్రామంలో సోమవారం మొక్కలు నాటనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు తదితరులున్నారు.

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సంబరాలు



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఆదివారానికి 30 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇందుకూరుపేట మండలం మైపాడు గ్రామంలో ముదిరాజ్ మహాసభ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గంపల అనీల్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ బహుజనుల సంక్షేమం కోసం పాటుపడిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సభ్యులు తుమ్మాల విజయ్ కుమార్, తుమ్మల సురేష్, తోకల మురళి, కంటు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 1: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా మహాత్మాగాంధీ, స్థలదాత పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం గాంధీజీ జీవిత విశేషాలను పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి వేణురెడ్డి, ఆశ్రమ మేనేజర్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 1: ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న కొత్త పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు దశరధరామయ్య మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ ప్రభుత్వ ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దుచేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) విధానాన్ని పునరుద్ధరించే వరకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్తయ్య, ఉపాధ్యాయులు జనార్ధన్‌రావు, సుభాన్, హజరత్, సుబ్బయ్య, నౌరాజ్, పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, మండలాల ఏపీటీఎఫ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పొదలకూరు, సెప్టెంబరు 1 : పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బిగ్ టీవీ కిమ్స్, విజేత కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 328 మందికి వైద్యం అందించి, ఉచితంగా మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్ఐ హనీఫ్, టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, టీడీపీ నాయకులు, కిమ్స్, విజేత కంటి వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం

విడవలూరు, సెప్టెంబరు 1: స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో మన సేవా సంస్థ, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకి చెందిన మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు పేదలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల ఛైర్మన్ శ్రీనివాసులు, మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పెద్దలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులుగా ముసురు

● ఆందోళనలో అన్నదాతలు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 1: మండలంలో మూడు రోజులుగా ముసురు వాతావరణం కారణంగా వరి సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదటి దఫా ధాన్యం ధర పుట్టి రూ.21,500 ఉండగా ముసురు ప్రభావంతో రూ.17వేలు చేరినట్లు తెలుస్తోంది. దీనిని సాకుగా చూపి దళారులు, మిల్లర్లు కలిసి రైతుల దగ్గర తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఈవిషయమై వ్యవసాయ ఉన్నతాధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

శ్రీకృష్ణ స్వామి నగరోత్సవం

వైభవంగా నగరోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెం బరు 1: నగరంలోని మైపాడు రోడ్డు ప్రశాంతినగర్‌లో జరుగుతున్న శ్రీకృష్ణా ష్టమి వేడుకల ముగింపు సందర్భంగా శ్రీకృష్ణుని నగరోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవం డీజీపీ కల్యాణ మండపం నుంచి బీఎస్ఆర్ నగర్, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, సత్యనారాయణ పురం మీదుగా తిరిగి కల్యాణ మండపానికి చేరింది. నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు డీ సురమౌళి, పెంచల నరసయ్య, ఎంసీ సుధాకర్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● అల్లీపురంలో టీడీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు రూరల్, సెప్టెంబ రు 1: ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత, అల్లీపురం మాజీ ఉప సర్పంచ్ పోలూరు సుబ్బయ్య అన్నారు. చంద్రబాబు తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30వ సంవత్సరం వచ్చిన సందర్భంగా ఆదివారం అల్లీపురంలో సంబరాలు నిర్వహించారు. ఏపీలో పాలన వ్యవహారాల్లో సంస్కరణలు తీసుకువచ్చిన తొలి ముఖ్యమంత్రి చంద్రబాబే అన్నారు. నేడు ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించడానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలూరు సురేంద్ర, హరిబాబు నాయుడు, సాగర్‌బాబు, పెంచలయ్య, సుబ్బరాయుడు, మణి, వెంకయ్య పాల్గొన్నారు.

టీడీపీ నేతల అన్నదానం, వస్త్రదానం

నెల్లూరు(వైద్యం) : చంద్రబాబు నాయుడు తొలిసారి సీఎంగా ప్రమాణం చేసి 29 ఏళ్ల పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా నగరంలో టీడీపీ నేతలు అన్నదానం, వస్త్రదానం చేశారు. బాలాజీనగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదానం, వస్త్రదానం చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ నేత కేసీ కృష్ణ, బాలయ్యసైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి, టీవీ నటుడు సింగంశెట్టి మురళీ మోహన్‌రావు, అల్లంపాటి వెంకట రమణయ్య, కుంచాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వియానీ హోమ్‌లో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరు (విద్య), సెప్టెం బరు 1 : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని డైకస్‌రోడ్డు వియానీ హోమ్‌లో ఆదివారం పేద విద్యార్థులకు నిత్యావసరాలు అంద చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా తన తల్లి జయలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో అసోసియేషన్ వ్యవ స్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, సభ్యులు చిం తల అమరేంద్రరెడ్డి, బెజవాడ సునీల్, రాఘవేంద్ర షెట్టి, నలుబోలు బలరామయ్య నాయుడు, గోపీనాథ్, పొన్నం రవిచంద్ర, సుబ్బరామిరెడ్డి, స్వర్ణ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



లక్ష రూపాయల చెక్కును అందచేస్తున్న పాఠశాలల నిర్వాహకులు

నెల్లూరు (విద్య), సెప్టెం బరు 1 : బడ్జెట్ స్కూల్స్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని మాగుంట లేఅవుట్ హెచ్ ఎస్ఆర్ కల్యాణ మండపంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్ నడపటంలో నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులకు హెల్త్‌కార్డులు, ఇళ్లస్థలాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు లక్ష రూపాయల విరాళాన్ని అందచేశారు. 150 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎన్ భానుశ్రీ, కార్యవర్గ సభ్యుడు షంషుద్దీన్, ఆంగ్లో ఫిల్ మల్లికార్జునరెడ్డి, శ్రీనివాస సుబ్బయ్య, విజ్ఞాన్ సుధాకర్, ఓవెల్ వేణు, సాయిచైతన్య హరినాథ్, కేబీఆర్ భాస్కర్‌రెడ్డి, ప్రశాంతి విద్యానికేతన్ ప్రమీల, ఎయిమ్స్ మస్తాన్, ఎస్‌వీఎస్ రెడ్డి, బెవింగ్ టన్ భాస్కర్, ఫీర్ధీ కృష్ణ, బాబా అమీర్‌జాన్ పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులోని వారిని చేర్చుకోం: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం): తనను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలను గౌరవంగా చూసుకుంటామని, కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసుతో సంబంధం ఉండే కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకునే ప్రశ్నేలేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం 17, 18, 34వ డివిజన్ల కార్పొరేటర్లు పేనేటి సుధాకర్, తోటకూర అశోక్‌కుమార్, షేక్ పామిదాలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. కాగా, 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, వైసీపీ ఇన్‌చార్జి బాబీ తదితరులు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. టీడీపీలో చేరేందుకు వారు సంసిద్ధత వ్యక్తం చేశారు. 2వ డివిజన్ కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్ యాదవ్ పార్టీలో చేరేందుకు ఎమ్మెల్యేను కోరారు. స్థానిక నాయకులతో చెబుతానని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి వైసీపీ నాయకుడు పిండి సురేష్, ఆయన సతీమణి కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ కూడా టీడీపీలో చేరేందుకు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

పవన్ కల్యాణ్ రియల్ హీరో : అజీజ్



రక్తదాన శిబిరంలో అబ్దుల్ అజీజ్ తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నాయకుడు అయ్యాక రియల్ హీరో అనిపించుకుంటున్నారని, ఆయన జన్మదినాన్ని సమాజ సేవ ద్వారా జనసేన నాయకులు పండగలా జరుపుతున్నారని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ కొనియాడారు. పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా జనసేన నాయకులు రెడ్‌క్రాస్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని అజీజ్, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ ప్రారంభించారు. అజీజ్ మనం చేసే సేవ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్, జమీర్, రవి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, లాయర్ శ్రీరామ్, కాకు మురళి పాల్గొన్నారు.

వైద్య శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం) : ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం కోదండ రామపురంలోని మహాలక్ష్మీ ఆలయంలో వైద్య శిబిరం జరిగింది. వెంకట కిరణ్ పెద్దిశెట్టి ఆధ్వర్యంలో డాక్టర్ కత్తి తిరుమల, డాక్టర్ ప్రేమదీప్ రోగులను పరీక్షించి వైద్య సలహాలు, మందులు ఇచ్చారు. పూసల లక్ష్మీమహేశ్వర రావు, చెక్క మనోహర్, పత్తి రాము, గణేష్ మురళీ, సురేష్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

రాసలీలల అలంకారంలో

వేణుగోపాలుడు



నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 1 : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ అవతార మహోత్సవాల్లో ఆదివారం రాత్రి రాసలీలల అలంకారంలో శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవరులకు అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారా యణం జరిగాయి.

● రాజేంద్రనగర్ మురళీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివా రం రాత్రి బృందావనం అలంకారం కనుల పండువగా జరిగింది. ఉదయం, సాయంత్రం చతుస్థాన అర్చనలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

6 నుంచి వేళాంగిణి ఉత్సవాలు

● బిషప్ ఎండీ ప్రకాశం

నెల్లూరు (సాంస్కృతికం) : కొత్త కోడూరు సముద్ర తీరాన వేళాంగిణి మాత జన్మదిన మహోత్సవాలను ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని బిషప్ ఎండీ ప్రకాశం పిలుపునిచ్చారు. నగరంలోని సెయింట్ క్యాథడ్రల్ చర్చిలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాటాడారు. ప్రతి ఏడాది వేళాంగిణి మాతను ఎంతోమంది దర్శించుకుంటారని చెప్పారు. 7వతేదీ ఉదయం ఆరాధన స్వస్థత ప్రార్థనలు, దివ్య బలిపూజ జరుగుతాయని తెలిపారు. 8వతేదీ వేళాంగిణి మాత జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఫాదర్ లూకస్ రాజు మాట్లాడుతూ వేళాంగిణి ఉత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ వైడీ హృదయరాజ్, ఫాదర్ సావిమో, ఫాదర్ పాపారావు, లూయిస్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం



గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్‌విండో ద్వారా అనుమతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 1 : వినాయక చవితి వేడుకల సందర్భంగా గణేష్ మండప నిర్వాహకులకు సేవలు అందించేందుకు ఆదివారం స్థానిక ట్రంకు రోడ్డులోని టీవీఎస్ కల్యాణ్ సదన్‌లో సింగిల్ విండో కార్యాలయం ఏర్పాటు చేశారు. గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చవితి వేడుకలు ఈ నెల 7 నుంచి 11వతేదీ వరకు జరుగుతాయని చెప్పారు. గణేష్ మండపాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇప్పించడం జరుగుతుందన్నారు. సమితి కోశాధికారి ఏవీఆర్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా గణేష్ మండపాల ఏర్పాటు అనుమతులకు దరఖాస్తులను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యాలయంలో ఇన్‌చార్జులుగా హర్షవర్ధన్ 97048 44343, సీ శ్రీనివాసరెడ్డి 94407 54068 అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని గణేష్ మండప నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, నగరంలోని శివాజీసెంటర్‌లో గణేష్ ఉత్సవ ఏర్పాట్లకు ఆదివారం ఉదయం గుంజ ప్రతిష్ఠ జరిగింది. వేద మంత్రాలతో విఘ్నేశ్వర పూజ చేశారు. ఎం పెంచలనాయుడు, కార్పొరేటర్ మహేష్, మాజీ కార్పొరేటర్లు మండ్ల ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరదలతో మహబూబాబాద్‌లో దిగిన సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 1 : సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో హైదరాబాద్‌కు బయలుదేరిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భారీ వర్షాలు, వరదల వల్ల మహబూ బాబాద్‌లో దిగారు. రైలు ఆ స్టేషన్‌లో ఆగిపోవటంతో బీఆర్ఎస్ నేత ఎర్రబల్లి దయాకర్ సూచన మేరకు ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుని వేరే వాహనంలో హైదరాబాద్‌కు వెళ్లారు. మహబూబా బాద్‌లో రైలు ఆగిపోయిన సందర్భంగా పాత మిత్రులను కలుసుకున్నానని సోమిరెడ్డి తెలిపారు.

అథ్లెటిక్స్ క్రీడాకారిణికి సన్మానం

నెల్లూరు (సాంస్కృ తికం), సెప్టెంబరు 1 : విదేశాల్లో ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ క్రీడల్లో షాట్‌పుట్ లో రాణించిన జిల్లాకు చెందిన క్రీడాకారిణి లక్ష్మీ సుహాసినీకి ఆదివారం నగరంలోని ఎస్ఆర్‌కే విశ్వసాయి పాఠశాలలో ఘనసన్మానం జరిగింది. లక్ష్మీ సుహాసినీ వెటరన్ క్రీడాకారిణిగా 72 ఏళ్ల వయసులో విదేశాలల్లో పోటీల్లో పాల్గొనడం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అభినందించారు. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సందడి అరుణ, తోట సులోచన, కరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 1 : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రమణయ్య పిలుపునిచ్చారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వ హించిన జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. అనంతరం పదకొండు అంశాల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, కోశాధికారి మురళీధర్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సాంస్కృతిక కమిటీ సభ్యులు బొమ్మలాట పార్వతీశం, గోపీనాథ్, ఎన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీ రమణయ్య

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి
జిల్లా వార్తలు

సోమవారం 2 సెప్టెంబరు 2024



తిరుపతికి అంతర్జాతీయ విమానం వచ్చేసిందోచ్!



డాక్టర్ రవిపిళ్లైకి స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్

రేణిగుంట, సెప్టెంబరు 1: ఎట్టకేలకు తిరుపతి విమానాశ్రయంలో తొలిసారిగా ఓ అంతర్జాతీయ విమానం సేఫ్‌గా ల్యాండైంది. 2015 నవంబరు 22వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. చంద్రబాబు ముందుచూపుతో అప్పట్లోనే అంతర్జాతీయ విమాన రాకపోకల కోసం అన్ని వసతులను కల్పించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి చంద్రబాబు సీఎం అయిన మూడు నెలల్లోపే అంతర్జాతీయ విమానం రావడంతో ఇటువంటి విమానాల రాకపోకలకు తొలి అడుగు పడిందనే చెప్పుకోవాలి. ఆదివారం మధ్యాహ్నం 12.11 గంటలకు బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎంపైర్ ఏవియేషన్ విమానం నేరుగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండైంది. గల్ఫ్‌దేశంలో స్థిరపడిన కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ రవి పిళ్లై కుటుంబ సభ్యులతో కలిసి ఈ విమానంలో శ్రీవారి దర్శనార్థం తిరుపతికొచ్చారు. ఏటా శ్రీవారి దర్శనానికి వచ్చే ఈయన ఈసారి కేంద్రప్రభుత్వ అనుమతితో ప్రత్యేక విమానంలో వచ్చారు. దీనివల్ల భవిష్యత్తులో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి ఇది తొలి అడుగుగా విమానాశ్రయ అధికారులు భావిస్తున్నారు. కాగా, రవిపిళ్లైకి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు.



శ్రీహరి సేవలో హన్సిక

సినీ నటి హన్సిక ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన తల్లి మోనా మొత్వానితో కలిసి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం ముందుకు వచ్చిన హన్సికను అభిమానులు ఆసక్తిగా చూశారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఫామ్‌హౌస్‌లో దువ్వూరు సమావేశం

● టీడీపీలో చేరికపై చర్చలు

తడ, సెప్టెంబరు 1: వైసీపీకి రాజీనామా చేసిన చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆదివారం ఈ సమావేశం జరిగింది. వైసీపీ ఆవిర్భావం నుంచి బలమైన నేతగా కొనసాగిన దువ్వూరు కొద్దిరోజుల కిందట ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటినుంచి ఆయన టీడీపీ గూటికి చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ నేతలు కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని రెండు నెలల కిందట టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. కొద్దిరోజులక్రితం సదరు టీడీపీ నాయకులు మరోసారి అధినేత చంద్రబాబును హైదరాబాదులో కలవాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో దువ్వూరు తన వర్గీయులతో నిర్వహించిన సమావేశంలో టీడీపీలో చేరికపై చర్చించినట్లు తెలిసింది. వారం, పదిరోజుల్లో మరోసారి దొరవారిసత్రం వేదికగా సమావేశమై టీడీపీలో చేరికపై బహిరంగ ప్రకటన చేసేలా నిర్ణయించినట్లుగా సమాచారం. ఈ చేరికపై వేనాటి వర్గం గుర్రుగా ఉంది. ఎందుకంటే వైసీపీ ఆవిర్భావానికి ముందు దువ్వూరు టీడీపీతోనే తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. అప్పట్లో వారితో విభేదించి వైసీపీలోకి చేరడంతో రెండు వర్గాల మధ్య సఖ్యత లేదు. ఇపుడు దువ్వూరు టీడీపీలో చేరే ప్రయత్నాలను వేనాటి వర్గం అడ్డుకుంటుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

సముద్రంలో 'అల'జడి



శ్రీనివాససత్రం వద్ద, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు



కోట, సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కోట మండలం శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం సముద్రతీరంలో తహసీల్దారు జయజయరావు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. కోటలోని తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం కంట్రోల్ రూము ఏర్పాటు చేసి, సముద్ర తీరప్రాంతంలోని గ్రామాలపై నిఘా ఉంచారు. పంచాయతీల వారీగా అధికారులతో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వాయుగుండం ప్రభావం వల్ల సముద్రం వెంబడి ఈదురుగాలులు, వర్షపుజల్లులు కురుస్తున్నాయి. సముద్రంలో అలల ఉధృతి పెరుగుతుండటంతో మత్స్యకారులు కూడా చేపల వేట నిలిపేశారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడినందున రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలన్నీ విధిగా తమ ఆదేశాలను పాటించాలన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాలతో డీఈవో శేఖర్ కూడా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించాలని ఆదేశాలు జారీ చేశారు.

డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు

సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పాన్ని కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరాన ప్రముఖ సైకత శిల్పి, కళాకారుడు మంచాల సనత్‌కుమార్ ఆదివారం రూపొందించారు. ఈ క్రమంలో సనత్‌ను జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, సుజయ్‌బాబు, తీగల చంద్రశేఖర్ అభినందించారు.



- కోట

స్విమ్స్‌లో సీసీ కెమెరాలకు చిక్కిన రోగి

ఒంటరిగానే నడిచి వెళుతున్నట్లు గుర్తించిన పోలీసులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్‌లో ఐదు రోజుల కిందట కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప అదే రోజు వార్డు నుంచి ఒంటరిగా బయటకు వెళ్లిపోయినట్లు తేలింది. స్విమ్స్‌లోని ఓ సీసీ కెమెరాలో దీనికి సంబంధించిన ఫుటేజీని పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చి గత నెల 27వ తేదీన స్విమ్స్‌లోని ఏంఐసీయూ వార్డులో అడ్మిట్ అయిన రోగి టి.సీతారామప్ప అదే రోజు అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ రోగి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ తెలియరాలేదు. మరోవైపు రోగి ఆచూకీ కోసం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ రెండు ప్రత్యేక బృందాలనూ ఏర్పాటు చేశారు. ఆదివారం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి స్విమ్స్ ఆవరణలో వెతికించారు. సీతారామప్ప చికిత్స పొందుతున్న వార్డు నుంచి భవనం వెనుక ఎస్వీ యూనివర్సిటీ వైపు వరకు జాగిలం వచ్చి అక్కడినుంచి వెనుదిరిగింది. అనంతరం శ్రీపద్మావతి భవనంలో ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా.. సీతారామప్ప అడ్మిట్ అయిన ఆగస్టు 27వ తేదీ అర్ధరాత్రి తర్వాత 3.15 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో భవనం వెనుక మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సీతారామప్ప కుమారుడు విశ్వనాథ్‌ను పిలిపించి ఆ సీసీ పుటేజీలను చూపించగా తన తండ్రే అని గుర్తించాడు. అయితే గ్రౌండ్‌ఫ్లోర్‌లో నడుచుకుంటూ వెళుతున్న పుటేజీ మాత్రమే కనిపించడంతో ఆ భవనం వెనుకనుంచి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్లి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఐదు రోజులుగా చిన్నపాటి ఆధారం కూడా లభించకపోవడంతో రోగి బంధువులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇపుడీ సీసీ పుటేజీని చూసినవారు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడికి వెళ్లి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, రోగిని ఎవరూ ఏమీ చేయలేదని ఆయనే వార్డు నుంచి బయటకు వెళ్లాడని, ఇందులో స్విమ్స్ యాజమాన్యం తప్పిదం లేదని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సీసీ కెమెరా పుటేజీ

పంచాయతీలకు మహర్దశ

● జిల్లాకు రూ.28.61కోట్ల నిధులు విడుదల

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలన్నీ నిర్వీర్యం చేశారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు జవసత్వాలు వచ్చాయి. 2023-24 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులను కోతలు లేకుండా పంచాయతీలకు విడుదల చేసింది. జిల్లాలో 774 పంచాయతీలు ఉండగా 15వ ఆర్థిక సంఘం రెండో విడత టైడ్ గ్రాంట్ కింద రూ.17.16కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యానికి వినియోగించనున్నారు. అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.11.44కోట్లు విడుదలైంది. ఈ నిధుల్లో గ్రామాల్లో అంతర్గత రోడ్లు, కాలువ పనులు, మొక్కల పెంపకం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, వీధిదీపాలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ, ఆరోగ్యకేంద్రాలు, పశువైద్యశాలల నిర్వహణ తదితర పనులకు ఉపయోగిస్తారు. మేజరు పంచాయతీలకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు, మైనర్ పంచాయతీలకు రూ.90వేల నుంచి సుమారు రూ.4లక్షలు వరకే వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా రూ.28.61కోట్ల నిధులు ఆయా పంచాయతీలకు జమయ్యాయి. దీంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం రెండో దఫా సుమారు మరో రూ.25కోట్లు మంజూరయ్యాయి.

గ్రామాల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాం

గ్రామాల అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు వినియోగిస్తాం. జనాభా ప్రాతిపదికన ప్రతి పంచాయతీకి నిధులు ఇస్తున్నాం. వీటిని సక్రమంగా వినియోగించడానికి అధికారులు, సర్పంచులు సహరించాలి.

- కలెక్టర్ వెంకటేశ్వర్



ధ్వంసమైన ఏటీఎం (ఫైల్ ఫొటో)

ఏటీఎంలో చోరీ ఇంటి దొంగల పనే..!

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి జరిగిన చోరీ ఇంటి దొంగల పనే అని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం. విశ్వసనీయ కథనం మేరకు.. ఎస్బీఐ ఏటీఎంలలో నగదు పెట్టే ప్రైవేటు సిబ్బంది అయిన కస్టోడియన్ సురేష్ పథకం ప్రకారం ఈనెల 27వ తేదీన కోసూరి కాంప్లెక్స్‌లోని ఏటీఎం మెషీన్‌లో నగదు పెట్టి.. దానికి సంబంధించిన తాళం వేయకుండా, ప్రధాన డోరుకు సంబంధించిన తాళం వేసి వచ్చేశాడు. అదే రోజు రాత్రి నగదు తరలించే వాహన డ్రైవర్ మనోజ్‌కు విషయాన్ని తెలిపాడు. అతను తన స్నేహితుడు మనోజ్‌కు విషయం తెలిపి.. నగదు చోరీకి ప్రణాళిక రూపొందించారు. డ్రైవర్ స్నేహితుడైన మనోజ్ సెక్యూరిటీ వేషధారణలో వచ్చి సురేష్ వద్ద ఉన్న ప్రధాన డోరు తాళంతో ఏటీఎం తెరిచి లోపలున్న నగదును చోరీ చేశాడు. అనంతరం ఇది ఇంటి దొంగల పనే అన్న అనుమానం రాకుండా ఉండటానికి గడ్డపారతో ఏటీఎంను కదిలించి, ధ్వంసం చేశాడు. కాగా, వీరు చంద్రగిరిలోనే కాకుండా తిరుపతిలోని గిరిపురం, అన్నారావు సర్కిల్, తుమ్మలగుంట దగ్గర ఉన్న ఎల్ఎస్‌నగర్‌లోని ఏటీఎంలలో కూడా ఈ తరహాలోనే చోరీ చేసినట్లు గుర్తించారు. ఏటీఎం చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసి, మరో రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 1: విజయవాడ నగర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా రైలు మార్గాలపై వర్షపు నీరు ప్రవహించడంతో తిరుపతినుంచి సికింద్రాబాదు వెళ్లే ప్రత్యేక రైలు, ఆదిలాబాదు నుంచి తిరుపతికి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రద్దు చేశారు. త్రివేండ్రం నుంచి న్యూఢిల్లీకి వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్‌ను కడప మార్గంలో దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ - గూడూరు మీదుగా చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్లను అధికసంఖ్యలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి-విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను కూడా రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

తమిళనాడుకు తరలుతున్న రేషన్ బియ్యం

సముద్ర తీర మండలాలను కేంద్రంగా చేసుకున్న 'మాఫియా'

కోట, సెప్టెంబరు 1: తమిళనాడుకు మన రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలిపోతోంది. సముద్ర తీర మండలాలను కేంద్రంగా చేసుకుని తమిళనాడు బియ్యం మాఫియా తన పనికానిచ్చేస్తోంది. సముద్రతీరంలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఏడాదిన్నరగా ఈ మాఫియా కన్నేసింది. ఇక్కడ పోలీస్, విజిలెన్స్ నిఘా పెద్దగా లేదన్న కారణంగా స్థానిక చిరు వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని మన రాష్ట్రానికి చెందిన రేషన్ బియ్యాన్ని కారుచౌకగా కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించుకుపోతోంది.

బియ్యం సేకరణ ఇలా..

చిరువ్యాపారులు బైక్‌లపై గ్రామాల్లోని చిన్న చిన్న దుకాణాలు, లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి కిలో రేషన్ బియ్యాన్ని రూ.12-15తో కొనుగోలు చేస్తారు. ఇలా సేకరించిన బియ్యాన్ని కోట మండలం విద్యానగర్, కోటల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడినుంచి ఆటోల ద్వారా తమకు అనుకూలమైన మండలాల్లోని రైసు మిల్లుల్లోకి రాత్రికి రాత్రే తరలించి, పాలిష్ చేయిస్తున్నారు. ఇలా పాలిష్ చేసిన బియ్యాన్ని తిరిగి విద్యానగర్‌కు చేర్చి, అక్కడినుంచి అర్ధరాత్రి నాయుడుపేట, చిట్టమూరు మండలం కొత్తగుంట మీదుగా చెన్నైకి లారీల్లో తరలించేస్తున్నారు. చెన్నై సిటీ సరిహద్దులో కిలో బియ్యాన్ని రూ.28-30 మధ్య విక్రయిస్తున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్ ఫొటో)

పట్టించుకునే వారేరి? : రేషన్ బియ్యం పల్లెల నుంచి పక్క రాష్ట్రానికి వెళుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. లారీలో బియ్యం తరలివెళ్లేటప్పుడు కొన్నిశాఖల అధికారులకు మామూళ్లను మాఫియా ఇస్తోందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇకనైనా బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, జనసేన, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఆదివారం సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బి బంగ్లాలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. పవన్, మెగా అభిమానులు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం చేశారు. పవన్ పేరుతో భారీకేక్ కట్‌చేసి అందరికి పంచారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, పార్థసారథి, జనసేన నాయకులు ఆవుల రమణ, మాబాషా, జగదీష్, రాము, దాసు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

వెంకటగిరి, సెప్టెంబరు 1: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పవన్‌కళ్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా రక్తదానం గొప్పదన్నారు. అనంతరం రక్తం దానం చేసిన యువతకు జనసేన ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు అనిల్ రామారావు, జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి రాధమ్మ, జాయింట్ సెక్రటరీ అరవ రాజేష్, ఉపాధ్యక్షుడు కోనా రవిశంకర్, ప్రధానకార్యదర్శి కె వెంకటేశ్వరరావు, రామ్మోహన్, తిరుమలేష్, మస్తాన్, అశోక్, రామారావు, ఎపి అందుల సంఘం అద్యక్షులు పచ్చారు పెంచల నరసయ్య నాయుడు తదితరులు వున్నారు.

నాయుడుపేటలో...

నాయుడుపేటటౌన్, సెప్టెంబరు1: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని జనసేనపార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వీపీఆర్ కాంప్లెక్స్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ముందస్తుగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, జనసేననాయకులు సతీష్, కిరణ్, గోపీ, జానకీరామ్, కోటి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో పోలీసు తనిఖీలు



వెంకటగిరిటౌన్, సెప్టెంబరు1: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో సీఐ రమణ ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి సిబ్బందితో కలిసి ఒక ప్రాంతాన్ని ఎంచుకుని వాహనాలు పరిశీలించామన్నారు. ఎటువంటి పత్రాలులేని 6 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాహన యజమాని పత్రాలు తీసుకుని వస్తే పరిశీలించి వారికి అందిస్తామని, తీసుకుని రాకపోతే కోర్టుకు పెడుతామని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమావేశం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 1 : బీజేపీ సభ్యత్వ నమోదుపై ఆదివారం పట్టణంలోని బీజేపీ రూరల్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు ఏపీఎస్ రవీంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌చార్జి బాధ్యతగా పనిచేసి కనీసం 200 మందిచేత సభ్యత్వ నమోదు చేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గురుప్రసాద్, రాజు, రమణయ్య, వేణయ్య, సుబ్బారావు, చెంచయ్య, మునిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 1: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం భద్రత లేకపోవడం దారుణమన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దుపరిచి ఓపీఎస్‌ను అమలు పరిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. నూతన పెన్షన్ విధానం ద్వారా ఉపాధ్యాయులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బాబు, జయపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, చంద్రశేఖర్, శివప్రసాద్, కోటేశ్వరరావు, మురళి, లోకనాథం, చంద్రశేఖర్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గూడూరు, సెప్టెంబరు 1: స్థానిక జీఎంయూపీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎంయూపీ పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత చదివిన పాఠశాలలో కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఓ వేదికపై కలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపామన్నారు. పాఠశాల అభివృద్ధికి త్వరలోనే చర్యలు చేపడుతామని తెలిపారు.

నేడు మహానవావరణ హోమం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 1: స్థానిక సీఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో సోమవారం సాయిసత్సంగ నిలయం ఆధ్వర్యంలో 700వ మహానవావరణ హోమపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం హోమ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లోకశాంతి కోసం అనేక ప్రాంతాల్లో ఇప్పటికే 699 నవావరణ హోమాలను పూర్తి చేశామని 700వ హోమపూజల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 1: స్థానిక గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నెల్లూరుకు చెందిన వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ విజయ, సంపత్‌కుమార్, సురేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, సెప్టెంబరు 1: మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

గూడూరు, సెప్టెంబరు 1: స్థానిక గ్రామదేవత తాళమ్మ ఆలయంలో పునర్నిర్మించిన గంగాభవానీ ఆలయంలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కుంభాభిషేక ఉత్సవాలను జరుపనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక తాళమ్మ ఆలయం వద్ద సభ్యులు మాట్లాడుతూ గంగాభావానీ అమ్మవారి గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీనివాసులు, చెంచయ్య మురళి తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో వీధి లైట్లు ఏర్పాటు చేయండి

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 1: మున్సిపాలిటీలోని 14వ వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతిపత్రం అందించారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసు నుంచి ఇందిరమ్మ కాలనీ, బొగ్గులమిట్ట వరకు వీధి లైట్లు కావాలని కోరారు. వీటిని వెంటనే మంజూరు చేసి ప్రజలు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

దూరాన ఉన్నా.. పింఛన్ పంపిణీ



పెళ్లకూరు, సెప్టెంబర్, 1 : పెళ్లకూరు గ్రామానికి చెందిన పింఛన్‌దారు అనారోగ్య పరిస్థితిలో దొరవారిసత్రం మండలం తల్లంపాడు ఉన్నందున సచివాలయ ఉద్యోగి అక్కడికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. మండల కేంద్రమైన పెళ్లకూరు గ్రామానికి చెందిన మైలారి నారమ్మ వృద్ధాప్యం కారణంగా కాలు జారి కిందపడిపోయింది. దీంతో కాలు విరగడంతో తల్లంపాడులోని తన కుమార్తె ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న సచివాలయ సర్వేయర్ లక్ష్మణ్ ఆదివారం తల్లంపాడుకు చేరుకున్నారు. నారమ్మ వద్ద వేలి ముద్రలు తీసుకుని పింఛన్ నగదును అందజేశారు.

చెరువు పనులు త్వరగా పూర్తి చేయాలి


చెరువు పనులను పరిశీలిస్తున్న ఇంజనీర్ మహేశ్

పెళ్లకూరు, సెప్టెంబర్, 1 : మండలంలోని చిల్లకూరు చెరువు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ మహేశ్ తెలిపారు ఆదివారం ఆయన చెరువు కట్ట అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. చెరువు కట్టను బలోపేతం చేస్తున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సర్పంచు పగడాల హరిబాబురెడ్డికి సూచించారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

వాకాడు, సెప్టెంబరు 1 : భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రామయ్య ఓ ప్రకటనలో కోరారు. వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వరరావు సెలవు ప్రకటించారని విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు వారి వారి ఇళ్లల్లో ఉండాలన్నారు.

పట్టలు, నీళ్ళ డ్రమ్ముల పంపిణీ



చిట్టమూరు, సెప్టెంబర్ 1 : మండల పరిధిలోని యల్లసిరి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వలీంటీర్లు మధు, గోపాల్ ఆధ్వర్యంలో పట్టలు, డ్రమ్ములను ఆదివారం పంపిణీ చేశారు. యల్లసిరి పంచాయతీలో 30 మంది రైతులకు నల్ల పట్టలు, నీళ్ల డ్రమ్ములను టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కాపులూరు చెంచురామయ్య చేతుల మీదుగా పంపిణీ జరిగింది.టీడీపీ నాయకులు రామయ్య, రాజారామిరెడ్డి, మణి, ప్రతాప్‌రెడ్డి, నాగూరయ్య, జాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చవితికి సిద్ధమైన వినాయక విగ్రహాలు


విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న కళాకారుడు, గజవాహనంపై ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వినాయక ప్రతిమ, అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

గూడూరు, సెప్టెంబరు 1: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకాలకు తయారీదారులు సిద్ధం చేస్తోన్నారు. ఈనెల 7వ తేదీన వినాయచవితి సందర్భంగా తయారీదారులు వినాయక విగ్రహాలను వివిధ రంగులతో, వివిధ ఆకృతులలో, వివిధ వాహనాలపై కొలువుతీరిన విఘ్నేశ్వరుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్నారు. స్థానిక కోర్టుసెంటర్ సమీపంలో నాలుగు తయారీకేంద్రాలలో వెయ్యికి పైగా వినాయక విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఉండేలా గత 6 నెలలుగా విగ్రహాలను తయారు చేస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. ఈ ఏడాది అడుగు విగ్రహం నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలను రూపొందించినట్లు చెబుతున్నారు. విగ్రహాలు రూ. 3 వేల నుంచి రూ.80వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ముడి సరకులు, కూలీల ఖర్చులు, ముడిసరకులపై జీఎస్టీ పెరగడంతో విగ్రహాల ధరలు గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 20శాతం వరకు పెరిగినట్లు చెబుతున్నారు. గూడూరు పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాలను ముందుగానే కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో దుకాణల వద్ద పండుగ వాతావరణం సంతరించుకుంది. వినాయకచవితిని ప్రతి వీధిలో, ప్రతిగ్రామంలో వాడవాడలా సందడిగా జరుపుకొంటారు.

వినాయక ప్రతిమలకు పెరిగిన డిమాండ్

కోట : కోట పట్టణంలో గత ఏడాది కంటే వినాయక విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. కోట పట్టణంలోని పలు చోట్ల వ్యాపారులు వినాయక విగ్రహాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒక్కొక్క విగ్రహం 5వేల నుంచి 25వేల రూపాయల వరకు పలుకుతోంది. పల్లెల నుంచి కోటకు యువకులు వచ్చి పోటాపోటీగా విగ్రహాలను కొనుక్కొని వెళ్తున్నారు. పల్లెల్లో ముందస్తు వినాయక చవితి సంబరాలు మొదలయ్యాయి.


కోటలో వినాయక విగ్రహాలు

తరలుతున్న వినాయక విగ్రహాలు

నాయుడుపేట, సెప్టెంబరు 1 : వినాయక చవితి సెప్టెంబరు 7వ తేదీ కావడంతో ముందస్తుగా చవితి నిర్వాహకులు వినాయక విగ్రహాలను కొనుగోలుచేసి ముందస్తుగా తమ గమ్యాలకు తరలిస్తున్నారు. నాయుడుపేట దర్గావీధిలో భారీగా ఏర్పాటు చేస్తున్న వినాయక చవితి సెట్టింగ్‌లలో అమర్చేందుకు ఆదివారం దాదాపు 20 అడుగుల పైగా ఉన్న వినాయక విగ్రహాన్ని తరలించారు. విగ్రహం ఎత్తు ఎక్కువగా ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు సమన్వయంగా వినాయక విగ్రహాలను తరలింపు చేశారు.


వినాయక చవితికి తరలిపోతున్న గణనాథ విగ్రహాలు

తాగునీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 1 : అవసరమైతే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి తెలుగు గంగ నీటిని మళ్లించి పట్టణంలో తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వెంకటగిరి పట్టణ వాసులకు తాగునీటి అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ఆదివారం ఆయన తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. మోటార్ల పనితీరును పరిశీలించిన ఆయన వెంటనే మరమ్మతులకు గురైన మోటార్లకు యుద్ధప్రాతిపదికన రిపేర్లు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు అడుగు భాగానికి చేరుకోవడం వల్ల నీటి సమస్య తలెత్తితే తెలుగుగంగ నీటిని ట్యాంకులోకి పంపింగ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ దొంతు శారద, రాష్ట్ర తెలుగుయువ ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, అంధుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చారి పెంచలనరసయ్య నాయుడు, నాయకులు మంకు ఆనంద్, కౌన్సిలర్లు డిల్లీ బాబు తదితరులు వున్నారు.


సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : ఎమ్మెల్యే పాశిం

గూడూరు, సెప్టెంబరు 1: యువత క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రసాద్‌నాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. స్టేడియంలో వాకింగ్ చేసే వారికి, క్రీడాకారులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునాతన నూతన జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఉన్న జిమ్ శిథిలావస్థకు చేరడంతో స్టేడియంలోని క్రీడాకారులు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో క్రీడాకారులకు, యువతకు ఆధునాతన జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే స్టేడియంలో శిథిలావస్థకు చేరుకున్న గ్యాలరీని తొలగించి నూతన గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి సమయంలో కూడా వాకింగ్ చేసుకునే విధంగా విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ జిమ్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు, వేగూరు రాజేంద్రప్రసాద్, సురేంద్రనాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, రజిని, గిరి పాల్గొన్నారు.


జిమ్ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

రిటైర్డు హెచ్‌ఎంకు సన్మానం


మాట్లాడుతున్న హెచ్‌ఎం గిరిధర్‌బాబు

కోట, సెప్టెంబరు 1 : గోవిందపల్లిపాళెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్‌పిఎస్ పూర్ణానందబాబు ఉద్యోగ విరమణ చెందడంతో ఆదివారం కోటలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మస్తానయ్య, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డిలు పూర్ణానందబాబును శాలువాలు, మెమెంటోలతో అభినందించారు.

వృద్ధులకు అన్నదానం



నాయుడుపేట, సెప్టెంబర్, 1 : నాయుడుపేటలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పెళ్లకూరు మండలం అర్ధమాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పాలచ్చూరు నరేంద్రయాదవ్, మంజుల దంపతులు ఆదివారం అన్నదానం చేశారు. తన కుమారుడు సుశాంత్ కృష్ణ పుట్టిన రోజు వేడుకలను వృద్ధాశ్రమంలో జరిపి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అక్కడే కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు వృద్ధులకు అందజేశారు.

రాష్ట్రస్థాయి కెల్కో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో పేట క్రీడాకారుల ప్రతిభ



నాయుడుపేట, సెప్టెంబరు1 : తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కెల్కో ఇండియా ఉమెన్స్ లీగ్ పోటీలలో నాయుడుపేట క్రీడాకారులు ప్రతిభ కనపరచినట్లు తైక్వాండో జిల్లా కోశాధికారి, కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. నాయుడుపేటకు చెందిన దీపిక క్యోరిగి క్యాడెట్ విభాగంలో ప్రథమస్థానం, జి. కృష్ణ, జశ్విత, పోమ్ససే క్యాడెట్ విభాగంలో ప్రథమస్థానం సాధించారు. వీరిని తైక్వాండో అసోసియేషన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్‌లు అభినందించారు. ఈ క్రీడాకారులు సెప్టెంబరు 11 నుంచి 14 వరకు జాతీయస్థాయిలో చెన్నైలో జరుగు పోటీలలో పాల్గొన్ననున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

నాయుడుపేట, సెప్టెంబరు 1 : ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న వర్కర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నాయుడుపేటలో ఆదివారం మద్యం దుకాణాల వర్కర్లు పురవీధుల్లో ర్యాలీ కొనసాగించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ నిరసన తెలియజేశారు. కొత్త ప్రభుత్వం నూతన మద్యం విధానాలతో తమ ఉపాధి కోల్పోతుందని వాపోయారు.

కోట : కోట పట్టణంలో ఆదివారం ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలలోని ప్రభుత్వ మద్యంషాపుల్లో పనిచేసే సెక్యూరిటీ, సూపర్ వైజర్లు, ఆపరేటర్లు తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రైవేట్ పరంకాబోతున్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వేరే ఉద్యోగాలు కల్పించాలన్నారు.

మొలకలపూడిలో రక్తదాన శిబిరం

చిట్టమూరు, సెప్టెంబర్ 1 : ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మొలకలపూడిలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, జనసేన నాయకులతో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 51 మంది యువకులు ముందుకొచ్చి రక్తం దానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య, రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు జిల్లా జనసేన అధ్యక్షుడు తీగల చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బసవనూరు భాస్కర్, మండల జనసేన అధ్యక్షుడు క్రాంతి, కుమార్, శేఖర్, శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో మహోద్యమంలా నేత్రదానం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 1: జిల్లాలో ఆగస్టు 25 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సూళ్లూరుపేటలో ఎంఎం చంద్రబాబుతో పాటు అలపాటి అశోక్‌కుమార్, మన్నెమాల శ్రీనివాసులు, వాకచర్ల సాయిలు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ తరఫున ఒక మహోద్యమంలా నేత్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వహిస్తున్న బృహోత్తర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సూళ్లూరుపేట కాకుండా సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పలు గ్రామాల నుంచి నేత్రదానం చేస్తున్నారు.